ప్రజానేస్తం జ్వాల

నిజం కోసం... నిర్భయంగా...

www.prajanesthamjwalanews.com | prajanesthamnews@gmail.com

అక్టోబర్ 24 శనివారం 2026 | సంపుటి : 1 | సంచిక : 15 | పేజీలు : 6 | వెల రూ. 4.00/- | ఎడిటర్ : చెన్నగాని పురుషోత్తం

SATURDAY OCTOBER 24 2026 | VOL:1 | ISSUE: 15 | PAGES:6 | Rs. 4:00 | EDITOR: CHENAGANI PURUSHOTHAM

సూర్యాపేట జిల్లాలో విషాదం.. కోతుల దాడిలో 12 ఏళ్ల బాలుడు మృతి!

6

కరోనా సమయంలో కేసీఆర్ మాటలు నమ్మి జనం శ్మశానాలకు చేరారు: సీఎం రేవంత్ రెడ్డి

- ఆయనో సైంటిస్టులా భావించుకుని బాధ్యతారహితంగా మాట్లాడారని తీవ్ర విమర్శ
- కాంగ్రెస్ ప్రభుత్వం కరవు సృష్టించిందన్న హరీశ్ రావు వ్యాఖ్యలపై మండిపాటు
- విపత్తులపై ప్రజలను హెచ్చరించడం ప్రభుత్వ బాధ్యత అని స్పష్టీకరణ



తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌పై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. కరోనా మహమ్మారి సమయంలో కేసీఆర్ వ్యవహరించిన తీరు బాధ్యతారహితంగా ఉందని, ఆయన మాటలను నమ్మి ప్రజలు ప్రాణాలు కోల్పోయి శ్మశానాల పాలయ్యారని ఆరోపించారు. విపత్తుల సమయంలో ప్రజలను అప్రమత్తం చేయాల్సిన బాధ్యతను గత ప్రభుత్వం పూర్తిగా విస్మరించిందని ఆయన విమర్శించారు.రాష్ట్రంలో నెలకొన్న కరవు పరిస్థితులపై రేవంత్ రెడ్డి స్పందిస్తూ, గత ఆరు నెలలుగా కరవు ముప్పు పొంచి ఉందని తమ ప్రభుత్వం అప్రమత్తం చేస్తూనే ఉందని గుర్తుచేశారు. అయితే, కాంగ్రెస్ ప్రభుత్వమే ఈ కరవును సృష్టించిందంటూ మాజీ మంత్రి హరీశ్ రావు వంటి నేతలు వ్యాఖ్యానించడం హాస్యాస్పదమని పేర్కొన్నారు. విపత్తుల పట్ల తమ ప్రభుత్వం బాధ్యతాయుతంగా వ్యవహరిస్తుంటే, బీఆర్ఎస్ నేతలు విమర్శలకు దిగడం సరైన పద్ధతి కాదని హితవు పలికారు. ఈ సందర్భంగా కరోనా కాలాన్ని ప్రస్తావిస్తూ కేసీఆర్‌పై ఆయన విరుచుకుపడ్డారు. “2019లో కరోనా వ్యాప్తి సమయంలో కేసీఆర్ తానేదో ఒక శాస్త్రవేత్త అన్నట్టుగా బాధ్యతారహితంగా మాట్లాడారు. ఆయన మాటలను నమ్మిన అమాయక ప్రజలు ప్రాణాలు కోల్పోయి శ్మశానాలకు చేరారు” అని రేవంత్ రెడ్డి ఘాటుగా వ్యాఖ్యానించారు. విపత్తుల గురించి ప్రజలను ముందుగానే హెచ్చరించి, వారిని అప్రమత్తం చేయడం ప్రభుత్వాల ప్రాథమిక బాధ్యత అని ఆయన స్పష్టం చేశారు. తమ ప్రభుత్వం ఆ బాధ్యతను నిర్వర్తిస్తుంటే, బీఆర్ఎస్ నేతలు దీనిని కూడా రాజకీయం చేయడంపై ఆయన మండిపడ్డారు.

డంపింగ్ యార్డ్ కాలుష్యంపై నిరాహార దీక్ష చేస్తా: మల్లారెడ్డి

- జవహర్ నగర్ డంప్ యార్డ్‌పై ఆమరణ దీక్ష చేస్తానన్న మల్లారెడ్డి
- రోజుకు ఇద్దరు అనుమానాస్పదంగా చనిపోతున్నారని ఆవేదన
- డంపింగ్ యార్డ్‌ను వెంటనే తరలించాలని డిమాండ్



బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి మల్లారెడ్డి తీవ్ర

మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లాలోని జవహర్ నగర్ డంపింగ్ యార్డ్ సమస్యపై స్థానిక

కాంగ్రెస్‌లో ప్రియాంక వర్సెస్ రాహుల్.. బీజేపీ సంచలన ఆరోపణలు

- రైహాన్ ఎగ్జిబిషన్ వివాదంపై రాహుల్ మౌనాన్ని ప్రశ్నించిన భండారీ
- ఈ వివాదంతో తన కుమారుణ్ని తెరపైకి తెచ్చేందుకు ప్రియాంక ప్రయత్నిస్తున్నారన్న భండారీ
- రాహుల్‌పై ప్రియాంకకు రాజకీయ విశ్వాసం తగ్గిందా? అని ప్రశ్న
- రైహాన్ వివాదంపై ఇప్పటి వరకు బహిరంగంగా స్పందించని రాహుల్



కాంగ్రెస్‌లో రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ మధ్య అంతర్గత పోరు సాగుతోందని బీజేపీ ఆరోపించింది. ప్రియాంక కుమారుడు రైహాన్ వాద్రా ఫొటో ఎగ్జిబిషన్‌లో కొన్ని చిత్రాలను తొలగించిన వివాదంపై రాహుల్ గాంధీ స్పందించకపోవడాన్ని ఆ పార్టీ ప్రస్తావించింది. ఈ వివాదాన్ని సృష్టించి తన కుమారుడిని రాజకీయంగా తెరపైకి తీసుకొచ్చేందుకు ప్రియాంక ప్రయత్నిస్తున్నారని బీజేపీ అధికార ప్రతినిధి ప్రదీప్ భండారీ విమర్శించారు. రాహుల్‌పై (మిగతా 2వ పేజీలో..)

బీజేపీ, బీఆర్ఎస్ మధ్య రహస్య ఒప్పందం.. టీపీసీసీ చీఫ్

బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు ఒక్కటేనన్న మహేశ్ గౌడ్

వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో రెండు పార్టీలు కలిసి పోటీ చేస్తాయని వ్యాఖ్య

పార్లమెంట్‌లో ప్రతి బిల్లుకు బీఆర్ఎస్ మద్దతిచ్చిందని విమర్శ

కాళేశ్వరంపై కిషన్ రెడ్డి సీబీఐ విచారణ హామీ ఏమైందన్న మహేశ్ గౌడ్

(మిగతా 2వ పేజీలో..)





మెటా గ్లాసెస్‌తో నాపై స్టింగ్ ఆపరేషన్‌కు యత్నం: కర్ణాటక సీఎం డీకే శివకుమార్

తనతో పాటు కేరళ సీఎం వీడీ సతీశన్‌ను లక్ష్యంగా చేసుకుని స్టింగ్ ఆపరేషన్ చేసేందుకు ప్రయత్నించారని కర్ణాటక ముఖ్యమంత్రి డీకే శివకుమార్ ఆరోపించారు. బీజేపీ, ఎన్డీయే కూటమి ముఖ్యమంత్రులపై కాకుండా కాంగ్రెస్ నేతలనే లక్ష్యంగా చేసుకున్నారని ఆయన పేర్కొన్నారు. కన్నడ వార్తా ఛానల్ ఏషియానెట్ సువర్ణ న్యూస్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఈ ఆరోపణలు చేశారు.ఓ పారిశ్రామికవేత్త తనను కలిసేందుకు వచ్చినప్పుడు మెటా స్మార్ట్ గ్లాసెస్ ధరించి ఉండటంతో అనుమానం కలిగిందని డీకే శివకుమార్ తెలిపారు.

(మిగతా 2వ పేజీలో..)

దేశ రాజకీయాల్లో కేసీఆర్ చక్రం తిప్పే రోజులు వస్తున్నాయి: కేటీఆర్

- దేశ రాజకీయాల్లో కేసీఆర్ కీలకమయ్యే రోజులు వస్తున్నాయని వ్యాఖ్య
- రేవంత్ రెడ్డి పాలన తాత్కాలికమేనని, త్వరలో కేసీఆర్ సీఎం అవుతారని ధీమా
- కాంగ్రెస్, బీజేపీయేతర కూటమి దేశంలో కీలకపాత్ర పోషిస్తుందని జోస్యం
- కరెంట్ కోతలతో రైతులు ఇబ్బంది పడుతున్నారని ప్రభుత్వంపై విమర్శలు
- ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు యువత తగిన గుణపాఠం చెబుతుందన్న కేటీఆర్



దేశ రాజకీయాల్లో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ కీలక పాత్ర పోషించే రోజులు దగ్గరలోనే ఉన్నాయని, ఆయన జాతీయ స్థాయిలో చక్రం తిప్పే సమయం ఆసన్నమైందని ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆశాభావం వ్యక్తం చేశారు. తెలంగాణలో రేవంత్ రెడ్డి ప్రభుత్వ హడావిడి కొద్దిరోజులు మాత్రమేనని, ఆ తర్వాత మళ్లీ కేసీఆరే ముఖ్యమంత్రి అవుతారని ఆయన ధీమా వ్యక్తం చేశారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో నిర్వహించిన అంబర్‌పేట నియోజకవర్గ బీఆర్ఎస్ ముఖ్య నేతల సమావేశంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని రంగాల్లో విఫలమైందని కేటీఆర్ ఆరోపించారు. తీవ్రమైన విద్యుత్ కోతల వల్ల రైతులు అల్లాడుతున్నారని, వారి కష్టాలను పట్టించుకోవడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని విమర్శించారు. ఎల్‌నినో ప్రభావంపై నిపుణులు పది నెలల ముందే హెచ్చరించినప్పటికీ, ప్రభుత్వం ముందస్తు చర్యలు చేపట్టడంలో విఫలమైందని మండిపడ్డారు. కాంగ్రెస్ హామీలను నమ్మి మోసపోయిన అన్ని వర్గాల ప్రజలు ఇప్పుడు (మిగతా 2వ పేజీలో..)



సరాక ప్రమాదంపై హరీశ్ రావు ఫైర్.. మృతుల కుటుంబాలకు కోటి పరిహారం డిమాండ్

- గడ్డపోతారం పారిశ్రామిక వాడలోని సరాక కెమికల్ పరిశ్రమలో గ్యాస్ లీక్ ప్రమాదం
- ఇద్దరు కార్మికుల దుర్మరణం
- సిగాచీ ఘటన నుంచి ప్రభుత్వం గుణపాఠం నేర్చుకోలేదన్న హరీశ్

సంగారెడ్డి జిల్లా జిన్నారం మండలం గడ్డపోతారం పారిశ్రామిక వాడలోని సరాక కెమికల్ పరిశ్రమలో జరిగిన గ్యాస్ లీక్ ప్రమాదంపై బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీశ్ రావు తీవ్రంగా స్పందించారు. ఈ దుర్ఘటనలో ఇద్దరు కార్మికులు మరణించడం పట్ల ఆయన తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు రూ. 1 కోటి చొప్పున ఎక్స్‌గ్రేషియా అందించాలని, గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ప్రభుత్వ అధికారుల నిర్లక్ష్యం, భద్రతా ప్రమాణాలను అమలు చేయకపోవడం వల్లే పదేపదే పారిశ్రామిక ప్రమాదాలు (మిగతా 2వ పేజీలో..)



ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంపై మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి కీలక ఆదేశాలు

- హైదరాబాద్‌లో ఇందిరమ్మ ఇండ్ల కోసం యుద్ధప్రాతిపదికన భూములు గుర్తించాలని ఆదేశం
- ఈ నెలాఖరులోగా లబ్ధిదారుల ఎంపిక పూర్తి చేయాలని మంత్రి పొంగులేటి సూచన
- లబ్ధిదారులకు రిజిస్ట్రేషన్ ఛార్జీలు లేకుండా పూర్తి హక్కులు కల్పించనున్న సర్కార్

హైదరాబాద్ కోర్ అర్బన్ రీజియన్ (క్యూర్) పరిధిలో ప్రతిపాదించిన ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం కోసం యుద్ధప్రాతిపదికన భూములను గుర్తించాలని రాష్ట్ర రెవెన్యూ, గృహ (మిగతా 2వ పేజీలో..)

'ఫెయిల్డ్ ప్రొడక్ట్' అంటూ రాహుల్ గాంధీపై మోదీ వ్యాఖ్య.. శశిథరూర్ కౌంటర్

కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీని ఉద్దేశించి ప్రధాని నరేంద్ర మోదీ చేసిన 'ఫెయిల్డ్ ప్రొడక్ట్' వ్యాఖ్యలపై కాంగ్రెస్ సీనియర్ నేత, ఎంపీ శశిథరూర్ తీవ్రంగా స్పందించారు. బీజేపీ వాస్తవానికి రాహుల్ గాంధీపైనే పూర్తి దృష్టి సారించిందని, అందుకే ఆయన్ను ఒక విలన్‌గా చిత్రీకరించే ప్రయత్నం చేస్తోందని ఆరోపించారు. రాహుల్ గాంధీ యువతలో (మిగతా 2వ పేజీలో..)



దక్షిణాది రాష్ట్రాల పోలీసుల మధ్య సమన్వయం పెంచాలి: సీఎం రేవంత్‌రెడ్డి



- దక్షిణాది రాష్ట్రాల పోలీసుల మధ్య సమన్వయాన్ని పెంచాలని సీఎం రేవంత్‌రెడ్డి పిలుపు
- పొరుగు రాష్ట్రాలతో సాంకేతిక పరిజ్ఞానం, ఐసీసీసీ వ్యవస్థలను పంచుకుంటామని వెల్లడి
- హైదరాబాద్ పోలీసు వ్యవస్థను మూడు కమిషనరేట్లుగా పునర్వ్యవస్థీకరించినట్లు ప్రకటన
- నేరాల నియంత్రణకు హైడ్రా, ఈగల్, టీ-సేఫ్ వంటి ప్రత్యేక విభాగాల ఏర్పాటు
- సైబర్ నేరాల నియంత్రణలో తెలంగాణ దేశంలో మొదటి స్థానంలో నిలిచిందని సీఎం వెల్లడి

దక్షిణాది రాష్ట్రాల పోలీసు బలగాల మధ్య సమన్వయాన్ని మరింత బలోపేతం చేయాలని తెలంగాణ (మిగతా 2వ పేజీలో..)

ప్రజానేస్తం జ్వాల
నిజం కోసం... నిర్భయంగా...
www.prajanesthamjwalanews.com | prajanesthamnews@gmail.com

దేశ రాజకీయాల్లో కేసీఆర్ చక్రం తిప్పే రోజులు వస్తున్నాయి: కేటీఆర్

(మొదటి పేజీ తరువాయి)

మళ్లీ బీఆర్ఎస్ వైపే చూస్తున్నారని అన్నారు. రేవంత్ రెడ్డి హడావిడి మరికొద్దిరోజులు మాత్రమే ఉంటుందని కేటీఆర్ పేర్కొన్నారు.జాతీయ రాజకీయాల గురించి ప్రస్తావిస్తూ, భవిష్యత్తులో కాంగ్రెస్, బీజేపీయేతర పార్టీలే దేశంలో నిర్ణయాత్మక పాత్ర పోషిస్తాయని కేటీఆర్ జోస్యం చెప్పారు. రాహుల్ గాంధీ ఎన్ని ప్రయత్నాలు చేసినా ఆశించిన ఫలితం ఉండదని, అటు ప్రధాని మోదీ పాలనలోనూ దేశానికి చేకూరిన ప్రయోజనం ఏమీ లేదని విమర్శించారు. రాష్ట్ర ప్రయోజనాల కోసం తెలంగాణ నుంచి గెలిచిన ఎంపీలెవరూ పార్లమెంటులో గళం విప్పడం లేదని ఆయన దుయ్యబట్టారు.రాబోయే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు యువత తగిన బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉందని కేటీఆర్ పేర్కొన్నారు. ప్రభుత్వ వైఫల్యాల వల్లే నేడు యువత రోడ్లపైకి వచ్చి పోరాటాలు చేయాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ నేతలు రాష్ట్ర అభివృద్ధిని విస్మరించి, కేవలం ప్రతిపక్షాలను విమర్శించడమే పనిగా పెట్టుకున్నారని ఆయన ఆరోపించారు.

డంపింగ్ యార్డ్ కాలుష్యంపై నిరాహార దీక్ష చేస్తా: మల్లారెడ్డి

(మొదటి పేజీ తరువాయి)

ఆవేదన వ్యక్తం చేశారు. డంపింగ్ యార్డ్‌కు వ్యతిరేకంగా త్వరలోనే ఆమరణ నిరాహార దీక్షకు దిగుతానని ఆయన ప్రకటించారు. జవహర్ నగర్‌పై ఓ అమెరికన్ యూనివర్సిటీ విడుదల చేసిన సర్వే ఫలితాలు తనను తీవ్రంగా కలచివేశాయని అన్నారు.ఈ సందర్భంగా మల్లారెడ్డి భావోద్వేగంతో మాట్లాడారు. “జవహర్ నగర్ నా నియోజకవర్గంలో ఉంది. అది నా గుండెకాయ. ప్రపంచంలోనే అత్యధికంగా మీథేన్ విషవాయువులు విడుదలవుతున్న ప్రాంతాల్లో జవహర్ నగర్ 4వ స్థానంలో ఉందని సర్వే చెప్పడం ఆందోళన కలిగిస్తోంది. ఈ ప్రాంతంలో రోజుకు కనీసం ఇద్దరు వ్యక్తులు అనుమానాస్పద స్థితిలో మరణిస్తున్నారు. వారి మృతికి కారణాలు తెలియడం లేదు” అని ఆవేదన వ్యక్తం చేశారు.ఈ సమస్యపై మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ స్పందించాలని మల్లారెడ్డి కోరారు. డంపింగ్ యార్డ్‌ను వెంటనే తరలించేలా కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని సూచించారు. 2006లో డంపింగ్ యార్డ్ నిర్వహణకు రాంకీ సంస్థతో ఒప్పందం జరిగిందని, కానీ ఆ సంస్థ నిర్లక్ష్యం కారణంగా ఈ ప్రాంతం విషవలయంగా మారిందని ఆయన ధ్వజమెత్తారు.

సరాక ప్రమాదంపై హరీశ్ రావు ఫైర్.. మృతుల కుటుంబాలకు కోటి పరిహారం డిమాండ్

(మొదటి పేజీ తరువాయి)

జరుగుతున్నాయని హరీశ్ రావు ఆరోపించారు. గతంలో జరిగిన సిగాచీ ప్రమాదం నుంచి ప్రభుత్వం ఎలాంటి గుణపాఠం నేర్చుకోలేదని ఆయన విమర్శించారు. ప్రమాదానికి కారణమైన కంపెనీ యాజమాన్యంపై కఠిన చర్యలతో పాటు ఘటనపై సమగ్ర విచారణ జరపాలని కోరారు. కార్మికుల భద్రతను పట్టించుకోకుండా, ప్రమాదాలు జరిగిన తర్వాతే అధికారులు ఫొటోలకు పోజులివ్వడానికి వస్తున్నారని ఆయన ఎద్దేవా చేశారు. గతంలో సిగాచీ పరిశ్రమలో ప్రమాదానికి గురై జీవనోపాధి కోల్పోయిన 54 కుటుంబాలకు కోటి రూపాయల నష్టపరిహారం ఇస్తామన్న ముఖ్యమంత్రి హామీని వెంటనే నెరవేర్చాలని ఈ సందర్భంగా హరీశ్ రావు గుర్తుచేశారు.

బీజేపీ, బీఆర్ఎస్ మధ్య రహస్య ఒప్పందం.. టీపీసీసీ చీఫ్

(మొదటి పేజీ తరువాయి)

తెలంగాణలో భారతీయ జనతా పార్టీ (బీజేపీ), భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) ఒక్కటేనని, వచ్చే ఎన్నికల్లో ఆ రెండు పార్టీలు కలిసే పోటీ చేస్తాయని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ ఆరోపించారు. గురువారం నిజామాబాద్ అర్బన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.బీజేపీ, బీఆర్ఎస్ పార్టీల మధ్య లోపాయికారి ఒప్పందం ఉందని మహేశ్ గౌడ్ విమర్శించారు. త్వరలో జరగనున్న రెండు పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానాలకు బీఆర్ఎస్ ఇప్పటివరకు అభ్యర్థులను ప్రకటించకపోవడమే ఇందుకు నిదర్శనమని ఆయన పేర్కొన్నారు. ముందుగా బీజేపీ తన అభ్యర్థులను ప్రకటించిన తర్వాత, బీఆర్ఎస్ కేవలం నామమాత్రంగా అభ్యర్థులను బరిలోకి దింపుతుందన్నారు.పార్లమెంట్‌లో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రతి బిల్లుకు బీఆర్ఎస్ మద్దతు తెలిపిందని, బీజేపీతో ఆ పార్టీకి ఉన్న సన్నిహిత సంబంధాలకు ఇదే నిదర్శనమని ఆయన దుయ్యబట్టారు. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో జరిగిన అవినీతిపై సీబీఐ విచారణ జరిపిస్తామని గతంలో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి చేసిన ప్రకటన ఏమైందని మహేశ్ కుమార్ గౌడ్ ఈ సందర్భంగా నిలదీశారు.

మెటా గ్లాసెస్‌తో నాపై స్టింగ్ ఆపరేషన్‌కు యత్నం: కర్ణాటక సీఎం డీకే శివకుమార్

అధికారుల ద్వారా అపాయింట్‌మెంట్ తీసుకున్న ఆ వ్యక్తి తొలుత వ్యాపార విషయాలు మాట్లాడారని, ఆ తర్వాత రాజకీయాలు, బూత్ స్థాయి వ్యూహాలు, రాజకీయ పరిణామాల గురించి చర్చ మొదలుపెట్టారని చెప్పారు. దీంతో ఆ వ్యక్తి నేపథ్యంపై విచారణ చేయాలని అధికారులను ఆదేశించినట్లు వెల్లడించారు.ఆ విచారణలో తనకు అందిన సమాచారం ప్రకారం.. ఆ పారిశ్రామికవేత్త కేరళ సీఎం పీడీ సతీశన్‌ను కలిసినప్పుడు కూడా అదే మెటా గ్లాసెస్ ధరించారని డీకే తెలిపారు. అయితే ఆంధ్రప్రదేశ్ సీఎం చంద్రబాబును, మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడ్నవీస్ ను, ఓ కేంద్ర మంత్రిని కలిసినప్పుడు మాత్రం వాటిని ధరించలేదని పేర్కొన్నారు.“ఆ వ్యక్తి నా దగ్గరకు, సతీశన్ దగ్గరకు వచ్చినప్పుడే మెటా గ్లాసెస్ పెట్టుకున్నాడు” అని డీకే శివకుమార్ అన్నారు. అయితే ఆ పారిశ్రామికవేత్త పేరును వెల్లడించలేదు. రహస్యంగా చిత్రీకరించేందుకు ప్రయత్నించినట్లు నిర్ధారించే ఆధారాలను కూడా ఇంటర్వ్యూలో బయటపెట్టలేదు.ఈ వ్యవహారంపై చర్యలు తీసుకోలేదన్న ప్రశ్నకు స్పందిస్తూ.. తాము అవసరమైన జాగ్రత్తలు తీసుకున్నామని, అయితే ఆ వివరాలను వెల్లడించడం లేదని చెప్పారు. తనకు అనుమానితుల గురించి సమాచారం అందిందని, మంత్రులు వ్యక్తిగత సహాయకులు, ఫోన్ కాల్స్ తదితర మార్గాల ద్వారా జరిగే ఉచ్చులో పడకుండా అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించినట్లు తెలిపారు.“మంత్రులు అప్రమత్తంగా ఉండాలని, మోసపోవద్దని చెప్పాల్సిన బాధ్యత ప్రభుత్వాధినేతగా నాపై ఉంది” అని డీకే అన్నారు. ఈ వ్యవహారంలో ప్రమేయం ఉన్నవారి పేర్లు, పత్రాలను సరైన సమయంలో బయటపెడతానని, ప్రస్తుతం వాటిని వెల్లడించే సమయం కాదని పేర్కొన్నారు.కర్ణాటకలో మాజీ సీఎం సిద్ధరామయ్యకు సంబంధించినట్లు చెబుతున్న స్టింగ్ వీడియోల వివాదం కొనసాగుతున్న నేపథ్యంలో డీకే వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. 2011 నాటి వీడియోలను ఉపయోగించి సిద్ధరామయ్యను పదవి నుంచి తప్పించేందుకు ప్రయత్నించారని కేంద్ర మంత్రి, జేడీఎస్ నేత హెచ్‌డీ కుమారస్వామి ఆరోపించారు. అయితే సిద్ధరామయ్యను తొలగించేందుకు స్టింగ్ ఆపరేషన్ చేయించారన్న ఆరోపణలను డీకే ఖండించారు. కాంగ్రెస్ కూడా విపక్షాల ఆరోపణలను తోసిపుచ్చింది.అక్టోబర్ 8న జరిగిన కేబినెట్ సమావేశంలో, మంత్రులను స్టింగ్ ఆపరేషన్ల ద్వారా ఇరికించే ప్రయత్నాలు జరగవచ్చని డీకే హెచ్చరించినట్లు సమాచారం. సుమారు పది మంది మంత్రులు, ముఖ్యమంత్రి కార్యాలయాన్ని లక్ష్యంగా చేసుకునేందుకు ఓ కేంద్ర మంత్రి, కర్ణాటక బీజేపీ నేత ప్రైవేటు ఏజెన్సీకి నిధులు సమకూర్చారని కాంగ్రెస్ ఎమ్మెల్యే రవి కుమార్ గణిగ ఆరోపించారు. ఇందుకు సంబంధించిన ఆధారాలు ఉన్న పెన్‌డ్రైవ్ తన వద్ద ఉందని చెప్పారు.మరోవైపు, వివాదాస్పద వీడియోల ప్రసారాన్ని అడ్డుకోవాలని కోరుతూ సిద్ధరామయ్య బెంగళూరు కోర్టును ఆశ్రయించారు. పోలీసు విచారణ కూడా కోరారు. అక్టోబర్ 14న రెండు వీడియోల ప్రసారాన్ని నిలిపివేస్తూ మీడియా సంస్థలు, డిజిటల్ వేదికలకు కోర్టు మధ్యంతర ఆదేశాలు జారీ చేసింది. వీడియోల తయారీ, ప్రచారంపై పోలీసుల దర్యాప్తు కొనసాగుతోంది.

ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంపై మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి కీలక ఆదేశాలు

(మొదటి పేజీ తరువాయి)

నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అధికారులను ఆదేశించారు. హైదరాబాద్‌లో ఉన్నతాధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లాల కలెక్టర్లతో కలిసి 'క్యూర్' ఇందిరమ్మ ఇండ్లు, డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పథకాల పురోగతిపై సుదీర్ఘంగా చర్చించారు.ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ, క్యూర్ పరిధిలో మూడు దశల్లో మొత్తం లక్ష ఇందిరమ్మ ఫ్లాట్లను నిర్మించనున్నట్లు వెల్లడించారు. ప్రస్తుతం కొనసాగుతున్న మొదటి దశతో పాటు, రెండు, మూడవ దశలకు అవసరమైన భూములను త్వరితగతిన సేకరించాలని అధికారులకు సూచించారు. లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియను ఈ నెలాఖరు నాటికి అత్యంత పారదర్శకంగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఎంపిక కోసం నిర్వహించే లాటరీ ప్రక్రియను యూట్యూబ్‌లో ప్రత్యక్ష ప్రసారం చేయాలని అధికారులకు స్పష్టమైన మార్గదర్శకాలు జారీ చేశారు.నగరంలోని పేదలకు వారి నివాస ప్రాంతాలకు, ఉపాధి మార్గాలకు సమీపంలోనే గృహ వసతి కల్పించాలనేదే ఇందిరమ్మ టవర్ల ప్రధాన ఉద్దేశమని మంత్రి వివరించారు. పేదలను నగర శివార్లకు తరలించకూడదన్నదే ప్రభుత్వ లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. ఈ పథకం కింద లబ్ధి పొందే వారికి ఫ్లాట్‌పై పూర్తి యాజమాన్య హక్కులతో పాటు, అవిభాజ్య భూమి వాటాను ఎటువంటి రిజిస్ట్రేషన్ ఛార్జీలు లేకుండా అందజేస్తామని హామీ ఇచ్చారు. ఇప్పటికే పలు నియోజకవర్గాల్లో ఇందిరమ్మ టవర్ల నిర్మాణానికి శంకుస్థాపనలు జరిగాయని, కొన్ని ప్రాంతాల్లో టెండర్ల ప్రక్రియ కూడా పూర్తయిందని మంత్రి గుర్తుచేశారు. లబ్ధిదారుల అర్హతలను నిశితంగా పరిశీలించిన తర్వాత బహిరంగ డ్రాల ద్వారా ఎంపిక ప్రక్రియ కొనసాగుతోందని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో ఇప్పటికే లక్షలాది ఇళ్లను మంజూరు చేసిన ఇందిరమ్మ పథకంలో భాగంగా, పట్టణ ప్రాంత గృహ నిర్మాణానికి కూడా ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందని పేర్కొన్నారు. భూముల గుర్తింపుతో పాటు ఇతర అనుబంధ ప్రక్రియలను వేగవంతం చేసి, ప్రాజెక్టుల నిర్మాణ వేగాన్ని కొనసాగించాలని అధికారులను ఆదేశించారు.

కాంగ్రెస్‌లో ప్రియాంక వర్సెస్ రాహుల్.. బీజేపీ సంచలన ఆరోపణలు

(మొదటి పేజీ తరువాయి)

ప్రియాంకకు రాజకీయ విశ్వాసం తగ్గిందా? అని ప్రశ్నించారు.వ్యక్తిగత పర్యటన కోసం గత ఆదివారం వియత్నాం వెళ్లిన రాహుల్ గాంధీ.. రైహాన్ ఎగ్జిబిషన్ వివాదంపై ఇప్పటివరకు బహిరంగంగా స్పందించలేదు. ఈ అంశాన్ని ప్రస్తావిస్తూ కాంగ్రెస్‌లో ప్రియాంక వర్సెస్ రాహుల్ పరిస్థితి నెలకొందని భండారీ సామాజిక మాధ్యమం ఎక్స్‌లో పోస్టు చేశారు. అయితే, కొన్ని రోజుల క్రితమే ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌కు వ్యతిరేకంగా జరిగిన నిరసనల్లో రాహుల్, ప్రియాంక కలిసి పాల్గొన్న విషయం తెలిసిందే.ఢిల్లీలో ఇటీవల జరిగిన విద్యార్థుల నిరసనలకు సంబంధించిన ఫొటోలను తన ఎగ్జిబిషన్ నుంచి తొలగించారని కళాకారుడు, ఫొటోగ్రాఫర్ రైహాన్ వాద్రా బుధవారం వెల్లడించారు. 'నో ఐడియా ఈజ్ ఫైనల్' పేరుతో బికనీర్ హౌస్‌లో ఈ ప్రదర్శన ఏర్పాటు చేశారు. ఎగ్జిబిషన్ ప్రారంభానికి కొన్ని గంటల ముందు 105 ఫొటోల్లో 74 చిత్రాలను తొలగించాలని లేదా వాటి స్థానంలో వేరేవి పెట్టాలని నిర్వాహకులు కోరినట్లు రైహాన్ తెలిపారు. ప్రదర్శన ప్రారంభమయ్యే సమయానికి 35 ఫ్రేములు మాత్రమే మిగిలాయని చెప్పారు. ఈ చిత్రాల సేకరణ కోసం మూడేళ్లు కష్టపడ్డానని పేర్కొన్నారు.అక్టోబరు 15నే ఎగ్జిబిషన్ లేఅవుట్‌ను బికనీర్ హౌస్ యాజమాన్యానికి పంపించానని, దానికి సంబంధించిన అంగీకార సమాచారం కూడా అందిందని రైహాన్ వెల్లడించారు. చిత్రాల ఏర్పాట్లు ప్రారంభించిన తర్వాతే అభ్యంతరాలు వ్యక్తమయ్యాయని ఆయన తండ్రి రాబర్ట్ వాద్రా తెలిపారు. మరోవైపు, తమ ప్రాంగణ విధానాలకు అనుగుణంగా లేవని గుర్తించిన ఫొటోలను తొలగించాలని కోరినట్లు బికనీర్ హౌస్ ప్రకటించింది.ఈ వివాదంపై స్పందించిన ప్రియాంక గాంధీ.. యువత గొంతును అణచివేసే ప్రయత్నంగా అభివర్ణించారు. రైహాన్ పంపిన ఇమెయిల్, ఎగ్జిబిషన్ ప్రతిపాదనకు సంబంధించిన స్క్రీన్‌షాట్లను బీజేపీ పంచుకుంది. జూన్ 10న పంపిన ప్రతిపాదనలో ప్రకృతి, వన్యప్రాణులు, అబ్‌స్ట్రాక్ట్ ఆర్ట్, పోర్ట్రెయిట్లు, శిల్పాల వంటి అంశాలే ఉన్నాయని భండారీ పేర్కొన్నారు. అందులో రాజకీయ అంశాల ప్రస్తావన లేదని అన్నారు. జూన్ 30న బికనీర్ హౌస్ ఈ ప్రతిపాదనను అంగీకరించిందని బీజేపీ తెలిపింది. అక్టోబరు 21న బికనీర్ హౌస్ యాజమాన్యం రైహాన్‌కు నోటీసు పంపి 74 ఫొటోలను తొలగించాలని కోరినట్లు భండారీ పేర్కొన్నారు. తొలుత రాజకీయ అంశాలు లేని ప్రదర్శనకు అంగీకారం పొందిన తర్వాత, కుటుంబం ఒత్తిడితో రాజకీయ ఫొటోలను చేర్చి ఉంటారని ఆరోపించారు. ఈ ఇమెయిళ్లు, ప్రతిపాదనలు ప్రియాంక గాంధీ, కాంగ్రెస్ చేస్తున్న వాదనల్లోని అసత్యాలను బయటపెడుతున్నాయని బీజేపీ విమర్శించింది.

దక్షిణాది రాష్ట్రాల పోలీసుల మధ్య సమన్వయం పెంచాలి: సీఎం రేవంత్‌రెడ్డి

(మొదటి పేజీ తరువాయి)

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పిలుపునిచ్చారు. రాష్ట్రాల సరిహద్దులతో సంబంధం లేకుండా పోలీసులు పరస్పరం సమన్వయంతో పనిచేసేలా పటిష్ఠ వ్యవస్థలను ఏర్పాటు చేయాలని సూచించారు. హైదరాబాద్‌లోని 'ఇంటిగ్రేటెడ్ కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్' (ఐసీసీసీ)లో శుక్రవారం జరిగిన దక్షిణ ప్రాంతీయ పోలీసు సమన్వయ కమిటీ (ఎస్ఆర్‌పీసీసీ) సమావేశంలో ఆయన మాట్లాడారు.తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కర్ణాటక, కేరళం రాష్ట్రాల డీజీపీలు, ఐజీలు, అండమాన్ నికోబార్ దీవులు, పుదుచ్చేరి, లక్షద్వీప్ ప్రతినిధులు, కేంద్ర దర్యాప్తు సంస్థల ఉన్నతాధికారులు ఈ సమావేశానికి హాజరయ్యారు. దక్షిణ భారతదేశాన్ని సురక్షిత ప్రాంతంగా తీర్చిదిద్దే బాధ్యత పోలీసు అధికారులపై ఉందని సీఎం పేర్కొన్నారు. పొరుగు రాష్ట్రాలతో సాంకేతిక పరిజ్ఞానాన్ని, ఐసీసీసీ వ్యవస్థలను పంచుకోవడానికి తెలంగాణ ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు.నేరాల స్వరూపం మారుతున్న నేపథ్యంలో పోలీసింగ్ విధానాల్లోనూ నిరంతర సంస్కరణలు అవసరమని రేవంత్‌రెడ్డి అన్నారు. పోలీసులకు కేటాయించే నిధులను ఖర్చుగా కాకుండా మెరుగైన సమాజ నిర్మాణానికి, ప్రజల భద్రతకు చేసే పెట్టుబడిగా చూడాలని చెప్పారు. ప్రజలు సమర్థంగా పనిచేసే, నైతిక విలువలను పాటించే, పక్షపాతం లేకుండా వ్యవహరించే పోలీసు వ్యవస్థను ఆశిస్తున్నారని పేర్కొన్నారు.హైదరాబాద్ పోలీసు వ్యవస్థను మూడు కమిషనరేట్లుగా పునర్వ్యవస్థీకరించామని సీఎం తెలిపారు. దీనివల్ల ప్రతి పోలీసు కమిషనర్ తన పరిధిపై ప్రత్యేకంగా దృష్టి సారించే అవకాశం ఉంటుందన్నారు. వివిధ రకాల నేరాల నియంత్రణ కోసం హైడ్రా, ఈగల్, టీ-సేఫ్ వంటి ప్రత్యేక విభాగాలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు.సైబర్ నేరాలు, మాదకద్రవ్యాల అక్రమ రవాణా, ట్రాఫిక్ సమస్యలు ప్రస్తుతం కీలక సవాళ్లుగా మారాయని రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. వీటిని ఎదుర్కొనేందుకు సాంకేతిక పరిజ్ఞాన వినియోగం, సిబ్బందికి శిక్షణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు.సైబర్ నేరాల నియంత్రణలో తెలంగాణ దేశంలోనే మొదటి స్థానంలో నిలిచిందని ప్రధాని అధ్యక్షతన జరిగిన ప్రగతి సమీక్ష సమావేశంలో గుర్తించినట్లు సీఎం తెలిపారు. తెలంగాణను నక్సలిజం రహిత రాష్ట్రంగా మార్చడంలో పోలీసుల కృషిని కేంద్ర హోంమంత్రి అమిత్ షా ప్రశంసించారని చెప్పారు. మాదకద్రవ్యాల నియంత్రణలో ఈగల్ విభాగానికి కేంద్ర ప్రభుత్వం 80 శాతానికి పైగా స్కోరు ఇచ్చిందన్నారు. సైబర్ నేరాల్లో బాధితులు కోల్పోయిన డబ్బును తిరిగి ఇప్పించడంలో తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో కొత్త ప్రమాణాలను నెలకొల్పుతోందని పేర్కొన్నారు.ఆహార కల్తీని అరికట్టడం, ఔషధాల నియంత్రణ కోసం అమెరికా ఎఫ్‌డీఏ తరహాలో వివిధ శాఖల మధ్య సమన్వయం కల్పించేలా టీ-సేఫ్ విభాగాన్ని ప్రారంభించినట్లు తెలిపారు. చెరువులు, సరస్సులు, ఇతర జలవనరులను పరిరక్షించి పునరుద్ధరించడంలో హైడ్రా కృషికి ప్రజల నుంచి ప్రశంసలు లభిస్తున్నాయని చెప్పారు. ప్రభుత్వ, ప్రజా ఆస్తుల పరిరక్షణకు కూడా ఈ సంస్థ పనిచేస్తోందన్నారు.హైదరాబాద్ ట్రాఫిక్ పోలీసు విభాగంలో ట్రాన్స్‌జెండర్లను ట్రాఫిక్ అసిస్టెంట్లుగా నియమించిన తొలి రాష్ట్రంగా తెలంగాణ నిలిచిందని సీఎం పేర్కొన్నారు. విధి నిర్వహణలో ప్రాణాలను సైతం పణంగా పెట్టే పోలీసు సిబ్బంది సంక్షేమం, వారి కుటుంబాల భవిష్యత్తు తనకు అత్యంత ప్రాధాన్యమని తెలిపారు.ఈ సమావేశంలో తెలంగాణ డీజీపీ సీవీ ఆనంద్, కర్ణాటక డీజీపీ ఎం.ఏ.సలీం, తమిళనాడు డీజీపీ మహేశ్ అగర్వాల్, పుదుచ్చేరి డీజీపీ షాలినీ సింగ్, లక్షద్వీప్ ఏడీజీపీ బి.శంకర్ జైస్వాల్, కేరళం ఐజీ అజిత బేగం, ఏపీ ఐజీపీ రవికృష్ణ, ఈగల్ డైరెక్టర్ సందీప్ శాండిల్య, తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో డైరెక్టర్ శిఖా గోయల్ తదితరులు పాల్గొన్నారు.

'ఫెయిల్డ్ ప్రొడక్ట్' అంటూ రాహుల్ గాంధీపై మోదీ వ్యాఖ్య.. శశిథరూర్ కౌంటర్

సరికొత్త ఉత్సాహాన్ని నింపారని, ఈ విషయాన్ని గమనించి బీజేపీ అప్రమత్తంగా ఉండాలని శశిథరూర్ సూచించారు.ఢిల్లీలో శుక్రవారం జరిగిన ఒక సదస్సులో శశిథరూర్ మాట్లాడుతూ, "గత కొన్ని నెలలుగా రాహుల్ గాంధీ ముఖ్యంగా యువ ఓటర్లలో గొప్ప ఉత్సాహాన్ని నింపారు. ఈ వాస్తవాన్ని బీజేపీ గుర్తించి మేల్కొంటే మంచిది. నిజానికి, బీజేపీ రాహుల్‌పైనే అమితమైన శ్రద్ధ చూపుతోందని, అందుకే ఆయన్ను ఒక ప్రతినాయకుడిగా చూపించేందుకు శతవిధాలా ప్రయత్నిస్తోందని నేను భావిస్తున్నాను" అని పేర్కొన్నారు.అంతకుముందు గురువారం ఇదే వేదికపై ప్రధాని నరేంద్ర మోదీ మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీ తన 'ఫెయిల్డ్ ప్రొడక్ట్'ని పదేపదే ప్రయోగించే క్రమంలో దేశాన్ని పణంగా పెడుతోందని విమర్శించారు. "శ్రీహరికోట నుంచి కూడా ఏడాదిలో ఇన్ని ప్రయోగాలు జరగవేమో కానీ, కాంగ్రెస్ మాత్రం తమ నేతను 'రీ-లాంచ్' చేసేందుకు అంతకంటే ఎక్కువసార్లు విఫలయత్నం చేస్తుంది" అంటూ పరోక్షంగా రాహుల్ గాంధీని ఉద్దేశించి ఎద్దేవా చేశారు.ప్రధాని చేసిన ఈ ఆరోపణలను శశిథరూర్ తిప్పికొట్టారు. నెహ్రూ-గాంధీ కుటుంబం కాంగ్రెస్‌కు భారంగా మారిందన్న మోదీ వ్యాఖ్యలతో ఆయన ఏకీభవించలేదు. కాంగ్రెస్‌లో అపారమైన అంతర్గత ప్రజాస్వామ్యం ఉందని, దానికి తానే ఒక ఉదాహరణ అని శశిథరూర్ వెల్లడించారు. "నేను కొన్ని సందర్భాల్లో పార్టీ నిర్ణయాలకు భిన్నమైన అభిప్రాయాలను వ్యక్తం చేసినప్పటికీ ఇప్పటికీ పార్టీలోనే కొనసాగుతున్నాను. పార్టీ నాకు పార్లమెంటరీ కమిటీకి అధ్యక్షత వహించే అవకాశంతో పాటు ఎన్నికల ప్రచార బాధ్యతలను కూడా అప్పగించింది. నేను భిన్నమైన అభిప్రాయాన్ని చెప్పినంత మాత్రాన నన్ను పార్టీ వ్యతిరేకిగా చూడరు" అని ఆయన స్పష్టం చేశారు. కాంగ్రెస్‌ను ఇతరులను ఎదగనీయని 'పరాన్నజీవి'గా అభివర్ణిస్తూ ప్రధాని చేసిన విమర్శలపై కూడా శశిథరూర్ స్పందించారు. కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉన్న విలువలు, దాని రాజకీయ విధానాలు తనకు బలమైన మద్దతునిస్తాయని ఆయన పేర్కొన్నారు. దేశ భవిష్యత్తుకు సంబంధించిన కీలక అంశాలపై బీజేపీ ప్రభుత్వాన్ని దీటుగా ఎదుర్కోవడానికి తాము సిద్ధంగా ఉన్నామని ధీమా వ్యక్తం చేశారు.

ప్రజానేస్తం జ్వాల
నిజం కోసం... నిర్భయంగా...
www.prajanesthamjwalanews.com | prajanesthamnews@gmail.com

కేంద్ర ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్‌ను వెంటనే తొలగించాలి

- SIR ప్రక్రియను రద్దు చేయాలి.. తొలగించిన ఓట్లను పునరుద్ధరించాలి: సీపీఎం డిమాండ్

గరిడేపల్లి, అక్టోబర్ 23 (ప్రజానేస్తం జ్వాల):



కేంద్ర ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్‌ను వెంటనే తొలగించాలని, స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (SIR) ప్రక్రియను రద్దు చేయాలని సీపీఎం, ప్రజాసంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం గరిడేపల్లి మండల కేంద్రంలోని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహం ఎదుట నిరసన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా సీపీఎం మండల కార్యదర్శి ఎస్.కె. యాకూబ్ మాట్లాడుతూ.. ఢిల్లీలో నిరసన తెలుపుతున్న విద్యార్థులు, యువత, మహిళలపై పోలీసులు దాడులు చేయడం, అక్రమ కేసులు నమోదు చేయడాన్ని ఖండించారు. ప్రజాస్వామ్య పద్ధతిలో నిరసన తెలిపే హక్కును కాపాడాలని, ఆందోళనకారులకు రక్షణ కల్పించాలని కోరారు.ఎన్నికల కమిషన్‌లో ముగ్గురు సభ్యులు ఉన్నప్పటికీ, నిర్ణయాలు ఏకపక్షంగా తీసుకుంటున్నారంటూ ఆయన విమర్శించారు. SIR ప్రక్రియను తక్షణమే రద్దు చేయాలని, ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్‌ను పదవి నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు.డబుల్ ఇంజన్ ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాల వల్ల దేశవ్యాప్తంగా ఇప్పటికే 13 కోట్ల 52 లక్షల ఓట్లు తొలగించబడ్డాయని నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. తొలగించిన ఓట్లను వెంటనే పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో దేశవ్యాప్తంగా ఆందోళనలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కమిటీ సభ్యులు దోసపాటి బిక్షం, రాయరాల శ్రీనివాస్, నందిపాటి మట్టయ్య, మండవ సైదులు, బి. శ్రీనివాస్, పందిరి వీరారెడ్డి, గుండెబోయిన సైదులు, మార్కపూడి వీరస్వామి, ఎలావల నారాయణ, జిలకర పెంటయ్య, సారెడ్డి సైదిరెడ్డి, బాలయ్య, ఎస్.కె. నాగులు, ఎల్. సంతోష్, కందుకూరి శ్రీనివాస్, బొడ్డుపల్లి బిక్షం, పోలేపల్లి వెంకన్న, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాక్షేత్రంలో ఆధార్ పార్టీ.. ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయం

రానున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో సత్తా చాటుతాం

2028 అసెంబ్లీ ఎన్నికల్లో 119 స్థానాల్లో పోటీ చేస్తాం: ఆధార్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు డా. ఈడా శేషగిరిరావు

సత్తుపల్లి, అక్టోబర్ 23 (ప్రజానేస్తం జ్వాల):



ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ఆధార్ పార్టీ ప్రజాక్షేత్రంలో పనిచేస్తుందని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు డా. ఈడా శేషగిరిరావు అన్నారు. రానున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేసి సత్తా చాటుతామని ప్రకటించారు. 2028లో జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్రంలోని 119 స్థానాల్లో తమ పార్టీ అభ్యర్థులను బరిలోకి దింపుతామని తెలిపారు.శుక్రవారం అంబోజి సుమలత అధ్యక్షతన నిర్వహించిన ఆధార్ పార్టీ సత్తుపల్లి నియోజకవర్గ కార్యకర్తల సమావేశంలో డా. ఈడా శేషగిరిరావు మాట్లాడారు. ఎల్‌నినో ప్రభావంతో వ్యవసాయ రంగం ఇబ్బందులు ఎదుర్కొంటోందని, పనులు లేక కూలీలు ఆర్థిక సమస్యలను ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. రైతులు, వ్యవసాయ కూలీలకు రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే ప్రత్యామ్నాయ ఉపాధి మార్గాలు చూపించాలని కోరారు. రాష్ట్రంలోని ప్రధాన రాజకీయ పార్టీలకు సరైన ప్రత్యామ్నాయంగా ఆధార్ పార్టీ ఎదుగుతుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ, క్షేత్రస్థాయిలో వారి సమస్యలను తెలుసుకుని పరిష్కారం కోసం నిరంతరం కృషి చేయాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు.సామాజిక న్యాయం, సమాన అవకాశాలు, రాజకీయ ప్రాతినిధ్యం కోసం ప్రజల్లో చైతన్యం తీసుకురావాల్సిన బాధ్యత కార్యకర్తలపై ఉందన్నారు. అట్టడుగు వర్గాల హక్కులు, ప్రజా సంక్షేమం కోసం పార్టీ నాయకులు, కార్యకర్తలు ఐక్యంగా పనిచేయాలని సూచించారు. అందరి సహకారంతో తెలంగాణలో ఆధార్ పార్టీని బలమైన రాజకీయ శక్తిగా తీర్చిదిద్దుతామని తెలిపారు.ఈ సమావేశంలో ఆధార్ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అంబోజి బుడయ్య, రాష్ట్ర ఎస్టీ సెల్ అధ్యక్షుడు అల్లెం వెంకటేశ్వర్లు, రాష్ట్ర ఎస్సీ సెల్ అధ్యక్షుడు బండ రాజారామ్, రాష్ట్ర చేరికల కమిటీ చైర్మన్ శ్రీనివాస్ గౌడ్, ఆర్గనైజింగ్ సెక్రటరీ తోడేటి దుర్గాప్రసాద్ గౌడ్, ఖమ్మం పార్లమెంట్ ఇన్‌చార్జి తల్లాడ వెంకన్న గౌడ్, ఖమ్మం జిల్లా అధ్యక్షుడు కుక్కల నాగేశ్వరరావు, కొత్తగూడెం జిల్లా అధ్యక్షుడు కంటే కేశవ గౌడ్, జిల్లా ఉపాధ్యక్షుడు ముత్తయ్య దొర, కొత్తగూడెం ఇన్‌చార్జి ప్రేమ్ దయాళ్, పినపాక ఇన్‌చార్జి కల్తీ రమేష్, ఇల్లందు ఇన్‌చార్జి అల్లెం రామ, అశ్వారావుపేట ఇన్‌చార్జి కరిష్మా పటాన్, మహిళా అధ్యక్షురాలు సుహాసిని, మహబూబాబాద్ పార్లమెంట్ ఇన్‌చార్జి బానోతు కవిత, ములుగు ఇన్‌చార్జి రామ తదితర పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

భూ సమస్యల పరిష్కారం కోసం 34 రోజులుగా రిలే నిరాహార దీక్ష

బాధితులకు ప్రజా కళాకారుడు బాదే నర్సయ్య సంఘీభావం.. భూ రికార్డులపై సమగ్ర విచారణ జరపాలని డిమాండ్

రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యంతో పేద రైతులు ఆర్థికంగా నష్టపోతున్నారు: బాదే నర్సయ్య

గరిడేపల్లి, అక్టోబర్ 23 (ప్రజానేస్తం జ్వాల):

భూ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సూర్యాపేట జిల్లా గరిడేపల్లి మండల రెవెన్యూ కార్యాలయం సమీపంలో గత 34 రోజులుగా రిలే నిరాహార దీక్ష చేస్తున్న బాధితులు లక్ష్మయ్య, భద్రమ్మలకు ప్రజా కళాకారుడు బాదే నర్సయ్య శుక్రవారం సంఘీభావం తెలిపారు. బాధితులు తమ భూమి, జీవనోపాధి, హక్కుల కోసం సుదీర్ఘకాలంగా పోరాటం చేస్తున్నారని పేర్కొన్నారు.ఈ సందర్భంగా బాదే నర్సయ్య మాట్లాడుతూ.. రెవెన్యూ రికార్డుల నిర్వహణలో తప్పిదాల కారణంగా ఒకరి భూమి మరొకరి పేరుపై నమోదవడం, భూ యాజమాన్య హక్కుల విషయంలో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారనే ఫిర్యాదులు గ్రామాల్లో ఉన్నాయని తెలిపారు. రెక్కాడితే గానీ డొక్కాడని పేద రైతులు భూ సమస్యల పరిష్కారం కోసం ఏళ్ల తరబడి కార్యాలయాలు, కోర్టుల చుట్టూ తిరుగుతూ ఆర్థికంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

పాస్‌బుక్కుల జారీలో జాప్యంపై ఆవేదన

నర్సింగ్ బక్కయ్యకు సంబంధించిన భూమికి ఇతరులకు పాస్‌బుక్కులు జారీ చేశారని, తనకు పాస్‌బుక్ ఇవ్వాలని కోరగా తన భూమి రోడ్డు కింద పోయిందని చెప్పినట్లు బాదే నర్సయ్య వివరించారు. ఉల్లందుల వెంకటయ్యకు పట్టా ఉన్నప్పటికీ, ఆయన 30 ఏళ్లుగా భూమిలో లేరంటూ తప్పుడు పంచనామా నివేదిక ఆధారంగా ఇతరులకు పాస్‌బుక్కులు జారీ చేశారని ఆరోపించారు.మరో బాధితురాలు జ్యోతికి పక్కా రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్ ఉన్నప్పటికీ, సుమారు పదేళ్లుగా పాస్‌బుక్ కోసం ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. సంబంధిత భూమిపై ఇతరులకు టైటిల్ పాస్‌బుక్కులు జారీ చేసినట్లు ఆరోపిస్తూ, ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ జరపాలని కోరారు.

అనాథ పిల్లలకు భూ హక్కులు కల్పించాలి

ముగ్గురు అనాథ పిల్లలకు సంబంధించిన భూమి విషయంలోనూ న్యాయం జరగడం లేదని బాదే నర్సయ్య పేర్కొన్నారు. దూత ప్రవళికతో పాటు మరో ఇద్దరు పిల్లల తల్లి, వారు నెల రోజుల వయస్సులో ఉన్నప్పుడే మరణించారని తెలిపారు. ఈ భూమికి సంబంధించి వారి అమ్మమ్మ అగ్రిమెంట్ రాసిచ్చినట్లు వివరించారు.ఈ భూమిపై కోర్టు బాధితులకు అనుకూలంగా తీర్పు ఇచ్చినప్పటికీ, ఇప్పటివరకు రెవెన్యూ అధికారులు పాస్‌బుక్కులు జారీ చేయలేదని ఆరోపించారు. పాస్‌బుక్కులు అందకపోవడంతో రైతుబంధు వంటి ప్రభుత్వ ప్రయోజనాలు పొందలేక బాధిత కుటుంబాలు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.

ఆరోపణలపై సమగ్ర విచారణ జరపాలి

రైతుల భూ హక్కులను కాపాడాల్సిన అధికారులే నిర్లక్ష్యం వహిస్తే పేదలకు న్యాయం ఎలా జరుగుతుందని బాదే నర్సయ్య ప్రశ్నించారు. తహసీల్దార్ కార్తీక్, బండ కవితతో పాటు సంబంధిత రెవెన్యూ అధికారులపై బాధితులు చేస్తున్న ఆరోపణల నేపథ్యంలో, తహసీల్దార్ స్రవంతి పాత్రపైనా సమగ్ర విచారణ జరపాలని డిమాండ్ చేశారు.ఆరోపణలు విచారణలో నిజమని తేలితే బాధ్యులపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని, అవసరమైన క్రమశిక్షణ చర్యలు చేపట్టాలని కోరారు. భూ రికార్డుల్లో జరిగినట్లు ఆరోపిస్తున్న అవకతవకలను సరిచేసి, అర్హులైన బాధితులకు చట్టప్రకారం న్యాయం చేయాలని, కోర్టు ఆదేశాలను అమలు చేసి అర్హులకు వెంటనే పాస్‌బుక్కులు జారీ చేయాలని ఉన్నతాధికారులను విజ్ఞప్తి చేశారు.ఈ నిరసన కార్యక్రమానికి సంఘీభావంగా సుధాకర్, వెంకటయ్య, తిరుపమ్మ, బుర్రమ్మ, ఝాన్సీ, ఎంకమ్మ తదితరులతో పాటు సుమారు 40 మంది పాల్గొన్నట్లు నిర్వాహకులు తెలిపారు.



ఘనంగా వీవీ కన్సల్టెన్సీ అధినేత వట్టికూటి వినోద్ కుమార్ గౌడ్ జన్మదిన వేడుకలు

- జన్మదిన వేడుకల్లో పండ్ల పంపిణీ.. చిన్నారులు, మహిళలు, పెద్దల భాగస్వామ్యం

హుజూర్‌నగర్, అక్టోబర్23 (ప్రజా నేస్తం జ్వాల):



వీవీ కన్సల్టెన్సీ అధినేత వట్టికూటి వినోద్ కుమార్ గౌడ్ జన్మదిన వేడుకలు హుజూర్‌నగర్‌లో ఆనందోత్సాహాల మధ్య జరిగాయి. ఈ సందర్భంగా నిర్వహించిన వేడుకల్లో భాగంగా చిన్నారులు, మహిళలు, పెద్దలు, స్థానిక ప్రజలు పాల్గొని జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.జన్మదినాన్ని పురస్కరించుకుని పండ్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పలువురు పాల్గొని వేడుకలను సందడిగా జరుపుకున్నారు.ఈ జన్మదిన వేడుకలను చక్కగా నిర్వహించిన పెండం అంజయ్య గౌడ్‌కు ప్రత్యేక అభినందనలు తెలియజేశారు. ప్రజల మధ్య ఆత్మీయతను పెంపొందించే ఇలాంటి కార్యక్రమాలు అభినందనీయమని పలువురు పేర్కొన్నారు.

రైతులు ఆరుతడి పంటల సాగుపై దృష్టి సారించాలి

- యాసంగి 2026-27లో నీటి యాజమాన్యంపై అప్రమత్తంగా ఉండాలి: ఏఈఓ మౌనిక

భీమదేవరపల్లి, అక్టోబర్ 23 (ప్రజానేస్తం జ్వాల):



రైతులు యాసంగి 2026-27 సీజన్‌లో ఆరుతడి పంటల సాగుపై దృష్టి సారించాలని హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం మల్లారం ఏఈఓ మౌనిక సూచించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఎల్‌నినో పరిస్థితుల దృష్ట్యా రైతులు పంటల ఎంపికలో జాగ్రత్తలు పాటించాలని, నీటి లభ్యతను బట్టి సాగు ప్రణాళిక రూపొందించుకోవాలని సూచించారు. నీటి వినియోగం అధికంగా ఉండే వరి సాగును తగ్గించి, ఆరుతడి పంటలకు ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు.నీటి యాజమాన్య పద్ధతులను పాటిస్తూ, అందుబాటులో ఉన్న నీటి వనరులను పొదుపుగా వినియోగించుకోవాలని రైతులకు సూచించారు. వాతావరణ పరిస్థితులు, నేల స్వభావం, నీటి లభ్యతకు అనుగుణంగా పంటలు సాగు చేయడం ద్వారా సాగు ఖర్చులు తగ్గించుకోవచ్చని తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన రిక్షా కార్మికుడి కుటుంబానికి ఆర్థిక సాయం

- మానవతా దృక్పథంతో బాధిత కుటుంబానికి అండగా నిలిచిన మున్సిపల్ చైర్మన్ దొంతగాని శ్రీనివాస్ గౌడ్

హుజూర్‌నగర్, అక్టోబర్ 23 (ప్రజానేస్తం జ్వాల):



హుజూర్‌నగర్ మున్సిపాలిటీ పరిధిలోని 20వ వార్డుకు చెందిన రిక్షా కార్మికుడు పిల్లుట్ల రమణయ్య రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో, ఆయన కుటుంబాన్ని మున్సిపల్ చైర్మన్ దొంతగాని శ్రీనివాస్ గౌడ్ పరామర్శించారు.ఈ సందర్భంగా మృతుడి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేసి, తక్షణ ఆర్థిక సహాయం అందజేశారు. కుటుంబ పెద్దను కోల్పోయి దుఃఖంలో ఉన్న కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. కష్టకాలంలో అధైర్యపడవద్దని, భవిష్యత్తులోనూ కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.రోడ్డు ప్రమాదంలో కుటుంబ పెద్దను కోల్పోయిన బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం అందించి, మానవతా దృక్పథాన్ని చాటుకున్న మున్సిపల్ చైర్మన్‌ను పలువురు అభినందించారు.ఈ కార్యక్రమంలో దొంతగాని జగన్, మధు, అసిఫ్ తదితరులు పాల్గొన్నారు.

వరంగల్‌లో భారీ వాహనం బోల్తా.. తృటిలో తప్పిన ప్రాణాపాయం

- ఉర్సు నుంచి ఖమ్మం వెళ్లే బ్రిడ్జిపై ప్రమాదం.. ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం

వరంగల్, అక్టోబర్ 23 (ప్రజానేస్తం జ్వాల):



వరంగల్‌లో భారీ వాహనం అదుపుతప్పి బోల్తా పడిన ఘటన కలకలం రేపింది. ఉర్సు నుంచి ఖమ్మం వెళ్లే మార్గంలోని బ్రిడ్జిపై గుజరాత్ నుంచి ఖమ్మం వైపు వెళ్తున్న భారీ వాహనం ప్రమాదానికి గురైంది.ఈ ప్రమాదంలో వాహనంలో తరలిస్తున్న పైపులు రోడ్డుపై చెల్లాచెదురుగా పడిపోయాయి. దీంతో బ్రిడ్జిపై వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. వాహనం బోల్తా పడినప్పటికీ ప్రాణాపాయం తప్పినట్లు ప్రాథమిక సమాచారం.రోడ్డుపై పడిపోయిన పైపుల కారణంగా వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ప్రమాదానికి గల కారణాలు, నష్టానికి సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

తెలంగాణలో పదో తరగతి పరీక్షల ఫీజుల షెడ్యూల్ విడుదల

మార్చి 2027లో జరగనున్న ఎస్ఎస్సీ, ఓఎస్ఎస్సీ, వొకేషనల్ పరీక్షలకు ఫీజుల తేదీలు ఖరారు

హైదరాబాద్, అక్టోబర్ 23 (ప్రజానేస్తం జ్వాల):

తెలంగాణ రాష్ట్రంలో మార్చి 2027లో నిర్వహించనున్న పదో తరగతి (ఎస్ఎస్సీ), ఓఎస్ఎస్సీ, వొకేషనల్ పబ్లిక్ పరీక్షల ఫీజుల చెల్లింపు షెడ్యూల్‌ను ప్రభుత్వ పరీక్షల సంచాలకుల కార్యాలయం విడుదల చేసింది. విద్యార్థులు నిర్ణీత గడువులోగా పరీక్ష ఫీజులు చెల్లించాలని అధికారులు సూచించారు.ఆలస్య రుసుము లేకుండా అక్టోబర్ 30 నుంచి నవంబర్ 16, 2026 వరకు పరీక్ష ఫీజులు చెల్లించవచ్చు. రూ.50 ఆలస్య రుసుముతో నవంబర్ 18 నుంచి డిసెంబర్ 1 వరకు, రూ.200 ఆలస్య రుసుముతో డిసెంబర్ 3 నుంచి 14 వరకు, రూ.500 ఆలస్య రుసుముతో డిసెంబర్ 16 నుంచి 28 వరకు ఫీజులు చెల్లించేందుకు గడువు కల్పించారు.పాఠశాలల ప్రధానోపాధ్యాయులు నిర్ణీత గడువులోగా విద్యార్థుల పరీక్ష ఫీజుల చెల్లింపుతో పాటు, వారి వివరాలను ఆన్‌లైన్‌లో సమర్పించే ప్రక్రియను పూర్తి చేయాలని అధికారులు సూచించారు. గడువులను పొడిగించబోమని స్పష్టం చేసినట్లు వెల్లడించారు.విద్యార్థులు చివరి తేదీ వరకు వేచి చూడకుండా ముందుగానే పరీక్ష ఫీజులు చెల్లించి, ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూసుకోవాలని సూచించారు.

ప్రజానేస్తం జ్వాల
నిజం కోసం... నిర్భయంగా...
www.prajanesthamjwalanews.com | prajanesthamnews@gmail.com

పొనుగోడులో ముమ్మరంగా పట్టభద్రుల ఓటరు నమోదు కార్యక్రమం

- రెండో రోజు కొనసాగిన నమోదు ప్రక్రియ.. పట్టభద్రులు స్వచ్ఛందంగా దరఖాస్తుల సమర్పణ
- కాంగ్రెస్ ప్రభుత్వానికి ఎమ్మెల్సీ ఎన్నికల్లో గుణపాఠం చెప్పాలి: బీఆర్ఎస్ నాయకులు



సభ్యులు అనంతు కరుణాకర్ గౌడ్, రామ్ మధు, నాయకులు పొలంపల్లి మహా ఆంజనేయులు, భాస్కర్, నందిపాటి మధు, నరహరి, రామ్ సతీష్, పంగ నాగయ్య, పట్టభద్రులు కొత్త వీరస్వామి తదితరులు పాల్గొన్నారు.

పొనుగోడు, అక్టోబర్ 23 (ప్రజానేస్తం జ్వాల):

వరంగల్--ఖమ్మం--నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ఓటరు నమోదు కార్యక్రమం పొనుగోడు బీఆర్ఎస్ గ్రామ పార్టీ ఆధ్వర్యంలో రెండో రోజు ముమ్మరంగా కొనసాగింది. ఈ సందర్భంగా పలువురు పట్టభద్రులు స్వచ్ఛందంగా ముందుకొచ్చి ఓటరు నమోదు కోసం దరఖాస్తులు సమర్పించారు.ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ.. ఎన్నికల ముందు నిరుద్యోగులు, ఉద్యోగులకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం విస్మరించి వారిని మోసం చేసిందని విమర్శించారు. ఆకర్షణీయమైన హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్, యువత సమస్యలను పట్టించుకోవడం లేదని ఆరోపించారు.రానున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో తెలంగాణ మేధావులు, ఉద్యోగులు, నిరుద్యోగులు, పట్టభద్రులు కాంగ్రెస్ ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. ఎమ్మెల్సీ ఎన్నికలతో బీఆర్ఎస్ విజయ ప్రస్థానం ప్రారంభం కానుందని ధీమా వ్యక్తం చేశారు.ప్రతి పట్టభద్రుడు ఓటరు జాబితాలో తమ పేరును నమోదు చేసుకుని, ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు. నిరుద్యోగులు, ఉద్యోగుల సమస్యలపై నిరంతరం పోరాడుతున్న బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థికి మద్దతుగా నిలిచి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మాజీ అధికార ప్రతినిధి రామ్ సైదులు, వార్డు

రత్నగిరి పాఠశాలలో కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ ఆకస్మిక తనిఖీ

విద్యార్థులకు గణిత ప్రశ్నలు.. స్వయంగా పాఠాలు బోధించిన కలెక్టర్

హనుమకొండ, అక్టోబర్ 23 (ప్రజానేస్తం జ్వాల):




హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలంలోని రత్నగిరి ప్రభుత్వ ఉన్నత ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రం, గ్రామ పంచాయతీ కార్యాలయాలను జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల తరగతి గదిలో విద్యార్థులతో మమేకమైన కలెక్టర్, వారికి గణిత ప్రశ్నలు వేసి విద్యా సామర్థ్యాలను పరిశీలించారు. విద్యార్థులకు స్వయంగా గణిత పాఠాలు బోధిస్తూ వారిని ప్రోత్సహించారు.పాఠశాలలో అమలవుతున్న మధ్యాహ్న భోజన పథకం నాణ్యత, విద్యార్థులకు అందుతున్న తాగునీటి సదుపాయాలపై కలెక్టర్ ఆరా తీశారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మెరుగైన మౌలిక వసతులు కల్పించాలని సూచించారు.పాఠశాల భవనానికి వెంటనే ఆకర్షణీయమైన పెయింటింగ్ వేయించాలని, పాఠశాలలో మౌలిక వసతుల మెరుగుదలకు అవసరమైన సమగ్ర ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు.విద్యా సంస్థల్లో పరిశుభ్రత, మౌలిక సదుపాయాల నిర్వహణకు ప్రాధాన్యతనిస్తూ, విద్యార్థులకు ఆహ్లాదకరమైన వాతావరణంలో విద్య అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

కాకతీయ యూనివర్సిటీలో రూ.3.01 కోట్లతో అభివృద్ధి పనులు ప్రారంభం

- పరీక్షల విభాగంలో నూతన భవనం, స్పోర్ట్స్ హాస్టల్ నుంచి ఇంజినీరింగ్ కళాశాల వరకు సీసీ రోడ్డు ప్రారంభించిన వీసీ ప్రతాప్ రెడ్డి

హనుమకొండ, అక్టోబర్ 23 (ప్రజానేస్తం జ్వాల):



కాకతీయ విశ్వవిద్యాలయంలో రూ. 3.01 కోట్ల వ్యయంతో పూర్తిచేసిన పలు కీలక అభివృద్ధి పనులను వీసీ ఆచార్య కె. ప్రతాప్ రెడ్డి శుక్రవారం లాంఛనంగా ప్రారంభించారు. విశ్వవిద్యాలయంలో మౌలిక సదుపాయాల అభివృద్ధిలో భాగంగా నిర్మించిన భవనం, రహదారిని ఆయన ప్రారంభించి అందుబాటులోకి తీసుకొచ్చారు.పరీక్షల విభాగంలో రూ. 1.67 కోట్ల వ్యయంతో నూతనంగా నిర్మించిన బ్లాక్-2 భవనాన్ని వీసీ ప్రారంభించారు. అలాగే స్పోర్ట్స్ హాస్టల్ నుంచి ఇంజినీరింగ్ కళాశాల వరకు రూ. 1.34 కోట్లతో నిర్మించిన సీసీ రోడ్డును ప్రారంభించి విశ్వవిద్యాలయానికి అంకితం చేశారు.ఈ అభివృద్ధి పనులతో పరీక్షల విభాగంలో మౌలిక సదుపాయాలు మెరుగుపడటంతో పాటు, విశ్వవిద్యాలయ ప్రాంగణంలో రవాణా సౌకర్యాలు మరింత సులభతరం కానున్నాయి.ఈ కార్యక్రమంలో కేయూ రిజిస్ట్రార్ ఆచార్య వి. రామచంద్రం, డెవలప్‌మెంట్ ఆఫీసర్ ఆచార్య వై. వెంకయ్యతో పాటు వివిధ విభాగాల అధికారులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

టీజీపీఎస్సీ పరీక్షలకు పకడ్బందీ బందోబస్తు

పరీక్ష కేంద్రాల చుట్టూ 500 మీటర్ల పరిధిలో సెక్షన్ 163 బీఎన్ఎస్ఎస్ అమలు

హనుమకొండ, అక్టోబర్ 23 (ప్రజానేస్తం జ్వాల):



తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీజీపీఎస్సీ) నిర్వహించే పరీక్షలు పారదర్శకంగా, ప్రశాంత వాతావరణంలో జరిగేలా వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని అన్ని పరీక్ష కేంద్రాల వద్ద పకడ్బందీ భద్రతా ఏర్పాట్లు చేపట్టినట్లు పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత వెల్లడించారు.ఈ నెల 24, 26 తేదీల్లో జరిగే పరీక్షల నేపథ్యంలో పరీక్ష కేంద్రాల చుట్టూ 500 మీటర్ల పరిధిలో బీఎన్ఎస్ఎస్ సెక్షన్ 163 అమలులో ఉంటుందని తెలిపారు. పరీక్ష జరిగే రోజుల్లో ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఆంక్షలు కొనసాగుతాయని పేర్కొన్నారు.పరీక్ష కేంద్రాల పరిసరాల్లోని జిరాక్స్ కేంద్రాలను తప్పనిసరిగా మూసివేయాలని, లౌడ్‌స్పీకర్ల వినియోగాన్ని నిషేధించినట్లు తెలిపారు. పరీక్షలకు ఆటంకం కలిగించే చర్యలకు పాల్పడితే కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.పరీక్షల నిర్వహణకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అభ్యర్థులు, ప్రజలు పోలీసులకు సహకరించాలని అధికారులు సూచించారు.

ఎలుగుబంటి దాడిలో రైతు మృతి

వ్యవసాయ బావి సమీపంలో దాడి.. కొడవటూరులో విషాదం

జనగామ, అక్టోబర్ 23 (ప్రజానేస్తం జ్వాల):




జనగామ జిల్లాలో విషాదకర ఘటన చోటుచేసుకుంది. బచ్చన్నపేట మండలం కొడవటూరు గ్రామ శివారులో ఎలుగుబంటి దాడిలో రైతు మిన్నలాపురం సిద్దయ్య (60) మృతి చెందారు.గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. సిద్దయ్య తన వ్యవసాయ భూమి వద్ద బర్రె పాలు పిండేందుకు వెళ్లారు. ఈ క్రమంలో వ్యవసాయ బావి సమీపంలో ఆయనపై ఎలుగుబంటి దాడి చేసినట్లు తెలిపారు. ఈ దాడిలో తీవ్రంగా గాయపడిన ఆయన మృతి చెందినట్లు సమాచారం.ఈ ఘటనతో కొడవటూరు గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. రైతు మృతితో కుటుంబ సభ్యులు, గ్రామస్థులు తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు.గ్రామ శివారులో ఎలుగుబంటి సంచారంతో స్థానికులు ఆందోళన చెందుతున్నారు. ప్రజల భద్రతకు అవసరమైన చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

వరంగల్ మహానగర అభివృద్ధికి రూ.382 కోట్లతో 5 భారీ ప్రాజెక్టులు

- కుడా ఆధ్వర్యంలో అభివృద్ధి పనులు.. ప్రపంచ బ్యాంకు రుణ సహకారంతో నిర్మాణాలు
- ఖిలా వరంగల్ కోట పరిరక్షణకు రూ.209 కోట్లు.. ఆధునిక బస్ టెర్మినల్‌కు రూ.125 కోట్లు

హనుమకొండ, అక్టోబర్ 23 (ప్రజానేస్తం జ్వాల -- ప్రతినిధి):




రూ.125 కోట్లు.వేయి స్తంభాల గుడి పరిసరాల సుందరీకరణ: రూ.20 కోట్లు.సెంట్రల్ ప్లాజా అభివృద్ధి: రూ.19 కోట్లు.మ్యూజికల్ గార్డెన్ ఆధునికీకరణ: రూ.9 కోట్లు.ఈ ఐదు ప్రాజెక్టుల ద్వారా వరంగల్ చారిత్రక కట్టడాలకు మరింత గుర్తింపు లభించడంతో పాటు, పర్యాటకులకు మెరుగైన సౌకర్యాలు అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది. ఆధునిక రవాణా సదుపాయాల విస్తరణతో నగర అభివృద్ధికి కొత్త ఊపునిస్తుందని భావిస్తున్నారు.

చారిత్రక వరంగల్ మహానగర సర్వతోముఖాభివృద్ధి లక్ష్యంగా కాకతీయ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (కుడా) ఆధ్వర్యంలో రూ. 382 కోట్ల వ్యయంతో ఐదు కీలక అభివృద్ధి ప్రాజెక్టులు చేపట్టేందుకు ప్రభుత్వం ఆమోదం తెలిపినట్లు సమాచారం. ప్రపంచ బ్యాంకు రుణ సహకారంతో ఈ ప్రాజెక్టుల నిర్మాణాన్ని చేపట్టనున్నారు.నగర చారిత్రక వారసత్వ పరిరక్షణతో పాటు పర్యాటక అభివృద్ధి, ఆధునిక మౌలిక సదుపాయాల కల్పనకు ఈ ప్రాజెక్టులు దోహదపడనున్నాయి. ప్రాజెక్టుల వారీగా కేటాయింపులు ఇలా ఉన్నాయి.ఖిలా వరంగల్ కోట పరిరక్షణ, కందకం (మోట్) అభివృద్ధి: రూ. 209 కోట్లు.ఆధునిక ఇంటిగ్రేటెడ్ బస్ టెర్మినల్ నిర్మాణం:

కేయూ ఇంజినీరింగ్ విభాగాల డీన్‌గా ప్రొఫెసర్ కె. కిశోర్ కుమార్ నియామకం

రెండేళ్ల పాటు బాధ్యతలు.. నియామకంపై హర్షం వ్యక్తం చేసిన వర్సిటీ వర్గాలు

హనుమకొండ, అక్టోబర్ 23 (ప్రజానేస్తం జ్వాల):



కాకతీయ విశ్వవిద్యాలయం ఇంజినీరింగ్ విభాగాల నూతన డీన్‌గా కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ విభాగానికి చెందిన సీనియర్ ఆచార్యుడు ప్రొఫెసర్ కె. కిశోర్ కుమార్ నియమితులయ్యారు. ఈ మేరకు విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య కె. ప్రతాప్ రెడ్డి ఆదేశాల మేరకు రిజిస్ట్రార్ ఆచార్య వి. రామచంద్రం అధికారిక ఉత్తర్వులు జారీ చేశారు.రెండేళ్ల కాలపరిమితితో ఈ నియామకం చేపట్టినట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. గతంలో బోర్డ్ ఆఫ్ స్టడీస్ అధ్యక్షుడిగా పనిచేసిన ప్రొఫెసర్ కిశోర్ కుమార్, విశ్వవిద్యాలయానికి విశేష సేవలందించారు.ఆయన నియామకం పట్ల కాకతీయ విశ్వవిద్యాలయ ప్రొఫెసర్లు, ఉద్యోగులు, పరిశోధక విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు. నూతన బాధ్యతల్లో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షిస్తూ శుభాకాంక్షలు తెలిపారు.

ముల్కనూరు సొసైటీలో పత్తి కొనుగోలు కేంద్రం ప్రారంభం

- మార్కెట్ ధరకు అదనంగా క్వింటాల్‌కు రూ.200.. రైతులకు ఆర్థిక భరోసా

భీమదేవరపల్లి, అక్టోబర్ 23 (ప్రజానేస్తం జ్వాల):

పత్తి రైతులకు గిట్టుబాటు ధర కల్పించి, వారి శ్రమకు తగిన ప్రతిఫలం అందించడమే లక్ష్యంగా ముల్కనూరు సహకార సంఘం ముందడుగు వేసింది. మార్కెట్ ధరకు అదనంగా క్వింటాల్‌కు రూ.200 చెల్లించేలా పత్తి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించింది.శుక్రవారం సంఘం పారాబాయిల్డ్ రైస్ మిల్లు ఆవరణలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని జిల్లా సహకార అధికారి బి. మోహన్, సంఘ అధ్యక్షుడు అలిగిరెడ్డి ప్రవీణ్ రెడ్డి, జనరల్ మేనేజర్ ఎం. రాం రెడ్డి ప్రారంభించారు.ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ.. అక్టోబర్ 23న మార్కెట్‌లో పత్తి క్వింటాల్ ధర రూ.9,010 ఉండగా, సహకార సంఘం అదనంగా రూ.200 కలిపి క్వింటాల్‌కు రూ.9,210 చొప్పున కొనుగోలు చేయనున్నట్లు తెలిపారు. పెరుగుతున్న సాగు పెట్టుబడులు, వ్యవసాయ ఖర్చుల నేపథ్యంలో ఈ నిర్ణయం రైతులకు కొంత ఆర్థిక ఊరటనిస్తుందని పేర్కొన్నారు.రైతులు తమ పత్తిని కొనుగోలు కేంద్రానికి తీసుకువచ్చి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. రైతులకు మెరుగైన ధర అందించడమే లక్ష్యంగా సహకార సంఘం ఈ చర్య చేపట్టడం పట్ల హర్షం వ్యక్తమవుతోంది.ఈ కార్యక్రమంలో సంఘ కార్యవర్గ సభ్యులు, మిల్లు మేనేజర్ అభిలాష్ రెడ్డి, పలువురు రైతులు పాల్గొన్నారు.



సన్న వడ్లకు రికార్డు ధరలు.. క్వింటాల్‌కు రూ.4 వేలు!

- తోడైన ప్రభుత్వ బోనస్.. రైతుల్లో వెల్లివిరుస్తున్న ఆనందం

హనుమకొండ, అక్టోబర్ 23 (ప్రజానేస్తం జ్వాల):

రాష్ట్రంలో సన్న రకం వరి సాగు చేసిన రైతులకు ఈసారి మార్కెట్లో ఆశాజనక ధరలు లభిస్తున్నాయి. పలు జిల్లాల్లో ఓపెన్ మార్కెట్లో సన్న వడ్ల ధర క్వింటాల్‌కు ఏకంగా రూ.4,000 వరకు పలుకుతున్నట్లు సమాచారం. గత ఏడాదితో పోలిస్తే ధరలు గణనీయంగా పెరగడంతో రైతుల్లో హర్షం వ్యక్తమవుతోంది.మార్కెట్లో సన్న వడ్లకు డిమాండ్ పెరగడంతో పలుచోట్ల వ్యాపారులు నేరుగా రైతుల కల్లాల వద్దకే వెళ్లి ధాన్యాన్ని కొనుగోలు చేస్తున్నట్లు తెలుస్తోంది. దీనికి తోడు రాష్ట్ర ప్రభుత్వం సన్న వడ్లకు క్వింటాల్‌పై రూ.500 బోనస్ అందిస్తుండటం రైతులకు అదనపు ఊరటనిస్తోంది. మార్కెట్ ధరలు, ప్రభుత్వ బోనస్ కలిసిరావడంతో సన్న వడ్లు సాగు చేసిన రైతులకు మెరుగైన ఆదాయం లభించే అవకాశం ఏర్పడింది.

పత్తికి కూడా మద్దతు ధర కంటే అధిక ధర

మరోవైపు ఆదిలాబాద్ (ఏడీబీ) మార్కెట్లో పత్తి ధరలు కూడా ఆశాజనకంగా నమోదయ్యాయి. సీసీఐ ప్రకటించిన మద్దతు ధర క్వింటాల్‌కు రూ.8,867 కాగా, తొలిరోజే పత్తి క్వింటాల్‌కు రూ.9,260 ధర పలికినట్లు సమాచారం. మద్దతు ధర కంటే అధికంగా ధర లభించడంతో పత్తి రైతుల్లోనూ ఆశలు చిగురిస్తున్నాయి.



లక్ష్య సాధనకు పట్టుదలతో కృషి చేయాలి

విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదిగి తల్లిదండ్రులకు, జిల్లాకు మంచి పేరు తీసుకురావాలి: కలెక్టర్ కె. హరిత

ఆసిఫాబాద్, అక్టోబర్ 23 (ప్రజానేస్తం జ్వాల ప్రతినిధి):



విద్యార్థులు తాము ఎంచుకున్న లక్ష్యాన్ని పట్టుదలతో సాధించి ఉన్నత స్థాయికి ఎదగాలని జిల్లా కలెక్టర్ కె. హరిత సూచించారు. కష్టపడి చదువుతూ ఉన్నత విద్యలో రాణించి తల్లిదండ్రులకు, గ్రామానికి, జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.శుక్రవారం ఆసిఫాబాద్ కలెక్టరేట్‌లో కౌటాల మండలం బోధన్‌పల్లికి చెందిన విద్యార్థి పెరుగు సాయిరాంకు కలెక్టర్ ల్యాప్‌టాప్ అందజేశారు. ప్రస్తుతం సాయిరాం ఐఐటీ కాన్పూర్‌లో విద్యనభ్యసిస్తున్న నేపథ్యంలో ఆయనను అభినందించారు.విద్యార్థులు విద్యాపకాశాలను సద్వినియోగం చేసుకుంటూ తమ ప్రతిభను చాటుకోవాలని, భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని కలెక్టర్ ఆకాంక్షించారు.

ప్రజానేస్తం జ్వాల
నిజం కోసం... నిర్భయంగా...
www.prajanesthamjwalanews.com | prajanesthamnews@gmail.com

మరిపెడ పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేసిన సీపీ స్వేతా ఐపీఎస్





- **స్టేషన్ రికార్డులపై ప్రతి సిబ్బందికి పూర్తి అవగాహన ఉండాలి గస్తీ విధుల్లో అప్రమత్తత.. ప్రజా భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలి**

మహబూబాబాద్, అక్టోబర్ 23 (ప్రజానేస్తం జ్వాల):

మరిపెడ పోలీస్ స్టేషన్‌ను వరంగల్ పోలీస్ కమిషనర్, భద్రాద్రి జోన్–xఎ డీఐజీ స్వేతా ఐపీఎస్ శుక్రవారం సందర్శించి సమగ్రంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మహబూబాబాద్ జిల్లా ఎస్పీ డా. శబరీష్ ఐపీఎస్ పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. పోలీస్ స్టేషన్‌కు చేరుకున్న సీపీకి సిబ్బంది గౌరవ వందనం సమర్పించారు.అనంతరం జిల్లా ఎస్పీతో కలిసి పోలీస్ స్టేషన్‌లోని కిట్ ఆర్టికల్స్, యూనిఫాంలు, షూస్, లాఠీలు తదితర పోలీస్ సామగ్రిని పరిశీలించారు. స్టేషన్ పరిసరాలు, వివిధ గదులు, ఫైళ్ల నిర్వహణ, రికార్డుల అమరికను తనిఖీ చేశారు. పరిశుభ్రత, క్రమబద్ధతకు సంబంధించిన 5ూ విధానం అమలు తీరును సమీక్షించారు.

రికార్డుల నిర్వహణలో నిర్లక్ష్యం వద్దు

పోలీస్ స్టేషన్‌లో నిర్వహిస్తున్న క్రైమ్ రికార్డులు, అనుమానితుల షీట్లు, డ్రగ్స్ డిస్పోజల్ రికార్డులు, ప్రాపర్టీ రిజిస్టర్, గన్ లైసెన్స్ రిజిస్టర్, డ్యూటీ రోస్టర్, విలేజ్ రోస్టర్, పెట్టీ కేసుల రిజిస్టర్, ప్రాసెస్ రిజిస్టర్ తదితర రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు.ప్రతి పోలీస్ అధికారి, సిబ్బందికి స్టేషన్ రికార్డులు, ఫైళ్లు, రిజిస్టర్ల నిర్వహణపై పూర్తి అవగాహన ఉండాలని సీపీ సూచించారు. కేసుల వివరాలను ఎప్పటికప్పుడు నవీకరిస్తూ, రికార్డులను నిబంధనల ప్రకారం నిర్వహించాలని ఆదేశించారు. అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తించాలని స్పష్టం చేశారు.

పెండింగ్ కేసుల పరిష్కారానికి ప్రాధాన్యత

ఎన్‌డీపీఎస్ కేసుల దర్యాప్తు, పెండింగ్ కేసుల పరిష్కారం, గంజాయి అక్రమ రవాణా నియంత్రణకు తీసుకుంటున్న చర్యలను సమీక్షించారు. సైబర్ నేరాల కేసుల్లో సమర్థవంతమైన దర్యాప్తు చేపట్టి బాధితులకు సత్వర న్యాయం అందించాలని సూచించారు. ఆన్‌లైన్ మోసాలు, నకిలీ పెట్టుబడి పథకాలు, ఓటీపీ మోసాలు, డిజిటల్ అరెస్టుల పేరుతో జరిగే మోసాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు. సైబర్ మోసాల బాధితులు వెంటనే 1930 హెల్ప్‌లైన్‌ను సంప్రదించేలా చైతన్యపరచాలని పేర్కొన్నారు.పోక్సో కేసుల్లో వేగవంతమైన, నిష్పక్షపాత దర్యాప్తు చేపట్టాలని, బాధిత బాలబాలికల గోప్యతను కాపాడుతూ వారికి అవసరమైన సహాయ సహకారాలు అందించాలని సూచించారు. బాలలపై నేరాల నివారణకు పాఠశాలలు, గ్రామీణ ప్రాంతాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు.

ప్రజలతో మర్యాదగా వ్యవహరించాలి

పోలీస్ శాఖ ప్రతిష్ఠ గస్తీ సిబ్బంది పనితీరుపై ఆధారపడి ఉంటుందని సీపీ పేర్కొన్నారు. గస్తీ విధుల్లో నిరంతరం అప్రమత్తంగా ఉంటూ ప్రజల భద్రతకు భరోసా కల్పించాలని సూచించారు. ప్రతి ఫిర్యాదుపై తక్షణమే స్పందిస్తూ బాధితులకు న్యాయం అందించాలని, మహిళలు, పిల్లలు, వృద్ధుల భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని తెలిపారు.ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్ సిబ్బందితో ముఖాముఖిగా మాట్లాడి వారి విధులు, బాధ్యతలు, సమస్యలు, సంక్షేమ అంశాలను అడిగి తెలుసుకున్నారు. విధుల్లో బిజీగా ఉన్నప్పటికీ ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. వ్యక్తిగత క్రమశిక్షణతో పాటు ఆర్థిక క్రమశిక్షణ పాటిస్తూ, ఆదాయానికి అనుగుణంగా ఖర్చులను నియంత్రించుకొని పొదుపునకు ప్రాధాన్యత ఇవ్వాలని హితవు పలికారు.పారదర్శకత, జవాబుదారీతనంతో విధులు నిర్వహిస్తూ ప్రజలకు నాణ్యమైన పోలీస్ సేవలు అందించాలని, ప్రజల్లో పోలీస్ శాఖపై నమ్మకాన్ని మరింత బలోపేతం చేయాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు.

పట్టభద్రుల ఓటరు నమోదు వేగవంతం చేయాలి

- **ఎమ్మెల్సీ అభ్యర్థి రామ్‌రెడ్డి సర్వోత్తమ్‌రెడ్డి గెలుపునకు కృషి చేయాలి: ఎమ్మెల్యే డా. మురళీ నాయక్**
- **ఇనుగుర్తిలో పట్టభద్రుల ఓటరు నమోదు డెస్క్ ప్రారంభం**

ఇనుగుర్తి, అక్టోబర్ 23 (ప్రజానేస్తం జ్వాల):

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి రామ్‌రెడ్డి సర్వోత్తమ్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించేందుకు పార్టీ శ్రేణులు సమష్టిగా కృషి చేయాలని ఎమ్మెల్యే డా. భూక్య మురళి నాయక్ పిలుపునిచ్చారు. అర్హులైన పట్టభద్రులను అధిక సంఖ్యలో ఓటర్లుగా నమోదు చేయించాలని నాయకులు, కార్యకర్తలకు సూచించారు.ఇనుగుర్తి మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బైరు అశోక్ గౌడ్ అధ్యక్షతన నిర్వహించిన వరంగల్--ఖమ్మం--నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహక సమావేశానికి ఎమ్మెల్యే హాజరయ్యారు. ఈ సందర్భంగా పట్టభద్రుల ఓటరు నమోదు డెస్క్‌ను ప్రారంభించారు. అనంతరం జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. 2023 నవంబర్ నాటికి డిగ్రీ పూర్తి చేసిన అర్హులైన పట్టభద్రులు తమ ఓటు హక్కును వినియోగించుకునేలా అవగాహన కల్పించాలని సూచించారు. అర్హులైన ప్రతి ఒక్కరినీ ఓటరుగా నమోదు చేయించే బాధ్యతను పార్టీ నాయకులు, కార్యకర్తలు తీసుకోవాలని కోరారు.ఓటరు నమోదు కార్యక్రమ పర్యవేక్షణ



బాధ్యతలను ఏఎంసీ డైరెక్టర్ కొట్టం రాము, వార్డు సభ్యుడు నద్దునూరి ప్రశాంత్‌లకు ఎమ్మెల్యే అప్పగించారు.ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ తమ్మడపెల్లి కుమార్, జిల్లా యూత్ కాంగ్రెస్ నాయకుడు సురేష్ నాయక్, రాష్ట్ర సోషల్ మీడియా కో-ఆర్డినేటర్ శివకుమార్, సర్పంచులు బానోతు రేణుక నరేష్, భూక్య లక్ష్మి వెంకన్న, సుజాత యాకయ్య, మీటు నాయక్, ముదిరెడ్డి కళావతి శ్రీనివాస్ రెడ్డి, బద్రు నాయక్, నరేష్ నాయక్, సతీష్‌తో పాటు మండల ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

టీబీ రహిత సమాజం కోసం సమష్టిగా కృషి చేయాలి

- **టీబీ లక్షణాలున్న వారిని గుర్తించి వెంటనే నిర్ధారణ పరీక్షలు నిర్వహించాలి**
- **జాతీయ ఆరోగ్య మిషన్ అదనపు కార్యదర్శి ఆరాధన పట్నాయక్**

సూర్యాపేట, అక్టోబర్ 23 (ప్రజానేస్తం జ్వాల న్యూస్):

దేశవ్యాప్తంగా క్షయవ్యాధి (టీబీ) నిర్మూలనకు మరింత పటిష్టమైన చర్యలు చేపట్టి, టీబీ రహిత గ్రామాల సంఖ్యను పెంచాలని జాతీయ ఆరోగ్య మిషన్ అదనపు కార్యదర్శి ఆరాధన పట్నాయక్ సూచించారు. గ్రామస్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు సమన్వయంతో పనిచేస్తూ టీబీ రహిత సమాజ నిర్మాణానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు.శుక్రవారం న్యూఢిల్లీ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా దేశంలోని వివిధ జిల్లాల కలెక్టర్లు, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు, ఎన్‌సీసీ అధికారులతో టీబీ నిర్మూలన కార్యక్రమాలపై సమన్వయ సమావేశం నిర్వహించారు. సూర్యాపేట జిల్లా కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ ఈ సమావేశంలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆరాధన పట్నాయక్ మాట్లాడుతూ, టీబీ ముక్త్ భారత్ అభియాన్‌లో భాగంగా గ్రామాల్లో దీర్ఘకాలిక దగ్గు తదితర టీబీ లక్షణాలతో బాధపడుతున్న వారిని గుర్తించి, వెంటనే సంబంధిత వైద్య పరీక్షలు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి మండలంలో ఎంపీడీవోల ఆధ్వర్యంలో జోష్ బృందాలను ఏర్పాటు చేసి, టీబీ లక్షణాలున్న వారిని గుర్తించే కార్యక్రమాన్ని విస్తృతం చేయాలని సూచించారు. ఈ బృందాల్లో ఎన్‌సీసీ క్యాడెట్లు, విద్యార్థులు, యువ క్రీడాకారులు, మై భారత్ వాలంటీర్లను భాగస్వాములను చేసి ప్రజల్లో వ్యాధిపై అవగాహన కల్పించాలన్నారు. జిల్లా స్థాయిలోనూ ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి కార్యక్రమాల అమలును నిరంతరం పర్యవేక్షించాలని పేర్కొన్నారు.టీబీ బాధితులకు పౌష్టికాహారం అందించడం వ్యాధి నియంత్రణలో కీలకమని తెలిపారు. సామాజిక బాధ్యతలో భాగంగా స్వచ్ఛంద సంస్థలు, దాతలు, వివిధ సంస్థల సహకారంతో బాధితులకు పోషకాహార కిట్లు అందించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.ఈ సమావేశంలో జడ్పీ సీఈవో శిరీష, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వెంకటరమణ, సంబంధిత వైద్యులు, వైద్య సిబ్బంది, ఎన్‌సీసీ అధికారులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.





ప్రజల రక్షణ కోసం ప్రాణత్యాగం చేసిన పోలీసు అమరవీరుల సేవలు చిరస్మరణీయం

- **అమర పోలీసు హెడ్ కానిస్టేబుల్ బడే సాహెబ్ కుటుంబానికి అదనపు ఎస్పీ రవీందర్ రెడ్డి పరామర్శ**

సూర్యాపేట, అక్టోబర్ 23 (ప్రజానేస్తం జ్వాల):

ప్రజల ప్రాణాలకు, ఆస్తులకు రక్షణ కల్పిస్తూ శాంతిభద్రతల పరిరక్షణ కోసం ప్రాణత్యాగం చేసిన పోలీసు అమరవీరుల సేవలు చిరస్మరణీయమని సూర్యాపేట జిల్లా అదనపు ఎస్పీ రవీందర్ రెడ్డి అన్నారు. పోలీసు ఫ్లాగ్ డే వారోత్సవాలు--2026, పోలీసు అమరవీరుల సంస్మరణ కార్యక్రమాల్లో భాగంగా శుక్రవారం సూర్యాపేట పట్టణంలో నివసిస్తున్న అమర పోలీసు హెడ్ కానిస్టేబుల్ బడే సాహెబ్ కుటుంబ సభ్యులను ఆయన వారి నివాసంలో పరామర్శించారు.ఈ సందర్భంగా బడే సాహెబ్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. కుటుంబ సభ్యులతో మాట్లాడి వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు.అనంతరం అదనపు ఎస్పీ మాట్లాడుతూ.. పోలీసులు ప్రజల భద్రతే లక్ష్యంగా నిరంతరం విధులు నిర్వహిస్తున్నారని, విధి నిర్వహణలో ప్రాణాలను సైతం లెక్కచేయకుండా ధైర్యసాహసాలు ప్రదర్శిస్తున్నారని పేర్కొన్నారు. 2000 సంవత్సరంలో తిరుమలగిరి పోలీస్ స్టేషన్‌పై నక్సలైట్లు దాడి చేసిన సమయంలో విధుల్లో ఉన్న హెడ్ కానిస్టేబుల్ బడే సాహెబ్ వీరోచితంగా పోరాడి అమరులయ్యారని గుర్తుచేశారు. ప్రజల రక్షణ కోసం ఆయన చేసిన ప్రాణత్యాగం పోలీస్ శాఖకు గర్వకారణమని కొనియాడారు.పోలీసు అమరవీరుల త్యాగాలు సమాజానికి స్ఫూర్తిదాయకమని, వారి త్యాగాల ఫలితంగానే ప్రజలు ప్రశాంత వాతావరణంలో జీవించగలుగుతున్నారని అన్నారు. విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన పోలీసు సిబ్బంది కుటుంబాల సంక్షేమానికి పోలీస్ శాఖ ప్రత్యేక శ్రద్ధ చూపుతుందని, అమరవీరుల కుటుంబాలకు అండగా నిలవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని తెలిపారు.పోలీసు ఫ్లాగ్ డే వారోత్సవాల ముఖ్య ఉద్దేశం అమరవీరుల త్యాగాలను స్మరించుకోవడం, వారి సేవలను ప్రజలకు తెలియజేయడంతోపాటు కుటుంబ సభ్యుల యోగక్షేమాలను తెలుసుకోవడమని పేర్కొన్నారు. దేశం కోసం, ప్రజల భద్రత కోసం ప్రాణత్యాగం చేసిన పోలీసు అమరవీరులను ప్రతి పౌరుడు గౌరవించాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో సూర్యాపేట పట్టణ ఇన్‌స్పెక్టర్ వెంకటయ్య, పోలీస్ అసోసియేషన్ అధ్యక్షుడు రమేష్, కార్యదర్శి కిరణ్, అమర పోలీసు బడే సాహెబ్ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయిలో సత్తాచాటిన విద్యార్థులకు కలెక్టర్ అభినందనలు

- **ఇన్‌స్పైర్ సైన్స్ ప్రాజెక్టులో మహీధర్ ప్రతిభ.. సీబీఎస్ఈ అథ్లెటిక్స్‌లో సాత్వికకు స్వర్ణం**



సూర్యాపేట, అక్టోబర్ 23 (ప్రజానేస్తం జ్వాల):

జాతీయ స్థాయిలో ప్రతిభ కనబరిచి జిల్లాకు గుర్తింపు తీసుకొచ్చిన ఎంఎస్ఆర్ సెంట్రల్ స్కూల్ విద్యార్థులు కొల్లు మహీధర్, కుమారి సాత్వికలను జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అభినందించారు.జాతీయ స్థాయిలో నిర్వహించిన ఇన్‌స్పైర్ సైన్స్ ప్రాజెక్టుల పోటీల్లో "స్మార్ట్ స్టీరింగ్ విత్ హెల్త్ అలర్ట్స్ టు రిడ్యూస్ ది యాక్సిడెంట్స్" అనే ప్రాజెక్టును ప్రదర్శించి జాతీయ స్థాయిలో అవార్డు సాధించిన విద్యార్థి కొల్లు మహీధర్‌ను కలెక్టర్ ప్రత్యేకంగా అభినందించారు. ప్రమాదాల నివారణకు ఆరోగ్య హెచ్చరికలతో కూడిన స్మార్ట్ స్టీరింగ్ ఆలోచనతో ప్రతిభ చాటడం అభినందనీయమన్నారు.అదేవిధంగా, సీబీఎస్ఈ జాతీయ స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో 600 మీటర్ల పరుగు పందెంలో స్వర్ణ పతకం సాధించిన ఎంఎస్ఆర్ సెంట్రల్ స్కూల్ విద్యార్థిని కుమారి సాత్వికను కలెక్టర్ అభినందించారు. విద్యార్థులు చదువుతోపాటు క్రీడలు, సైన్స్ రంగాల్లోనూ రాణిస్తూ ఉన్నత లక్ష్యాలను సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి సీహెచ్. శ్రీనివాస్ రావు, జిల్లా సైన్స్ అధికారి దేవరాజు, సెక్టోరియల్ అధికారులు పాల్గొన్నారు.

రాయికల్‌లో 10 అంగన్వాడీ టీచర్ పోస్టులకు అర్హుల జాబితా విడుదల

- **అభ్యంతరాలుంటే అక్టోబర్ 30లోగా ఐసీడీఎస్ కార్యాలయాన్ని సంప్రదించాలి**

రాయికల్, అక్టోబర్ 23 (ప్రజానేస్తం జ్వాల):



రాయికల్ పట్టణంతో పాటు మండలంలోని ఖాళీగా ఉన్న అంగన్వాడీ టీచర్ పోస్టుల భర్తీ ప్రక్రియలో భాగంగా అర్హులు, అనర్హుల అభ్యర్థుల జాబితాను శుక్రవారం సీడీపీవో జయప్రద విడుదల చేశారు. పట్టణ పరిధిలో మూడు, గ్రామీణ ప్రాంతాల్లో ఏడు కలిపి మొత్తం 10 అంగన్వాడీ టీచర్ పోస్టులు ఖాళీగా ఉన్నట్లు తెలిపారు. మండలంలోని రామారావుపల్లి, వస్తాపూర్, వీరాపూర్, శ్రీరాంనగర్, భూపతిపూర్, రామాజీపేట, లోక్యనాయక్ తండాతో పాటు రాయికల్ మున్సిపాలిటీ పరిధిలో ఈ పోస్టులు ఖాళీగా ఉన్నాయి.ఈ పోస్టులకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల్లో అర్హులు, అనర్హుల జాబితాలను సంబంధిత మున్సిపల్ కార్యాలయం, గ్రామ పంచాయతీల్లో సర్పంచులు, గ్రామ కార్యదర్శుల సమక్షంలో ప్రదర్శించారు. అభ్యంతరాలకు అక్టోబర్ 30 వరకు గడువు అనర్హుల జాబితాలో పేర్లు ఉన్న అభ్యర్థులకు ఏవైనా అభ్యంతరాలు, సందేహాలు ఉంటే వాటి పరిష్కారం కోసం ఈ నెల 30వ తేదీలోగా జగిత్యాలలోని ఐసీడీఎస్ కార్యాలయాన్ని సందర్శించాలని అధికారులు సూచించారు. అర్హులైన అభ్యర్థులకు తదుపరి ఎంపిక ప్రక్రియకు సంబంధించిన వివరాలను తెలియజేస్తామని పేర్కొన్నారు.ఈ వివరాలను సీడీపీవో జయప్రద, సూపర్‌వైజర్లు అనూహ్య, రాధ, పద్మావతి వెల్లడించారు.

ప్రజానేస్తం జ్వాల
నిజం కోసం... నిర్భయంగా...
www.prajanesthamjwalanews.com | prajanesthamnews@gmail.com

ఆర్టీఐ పెండింగ్ దరఖాస్తులు వెంటనే పరిష్కరించాలి

పీఐఓలకు కలెక్టర్ కె. హరిత ఆదేశం.. సోమవారంలోగా నివేదికలు సమర్పించాలి

ఆసిఫాబాద్, అక్టోబర్ 23 (ప్రజానేస్తం జ్వాల -- ప్రతినిధి):



సమాచార హక్కు చట్టం--2005 కింద అందిన దరఖాస్తులను నిర్ణీత గడువులోగా పరిష్కరించి, దరఖాస్తుదారులకు సమాచారం అందించాలని కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కలెక్టర్ కె. హరిత అధికారులను ఆదేశించారు. పెండింగ్ దరఖాస్తుల పరిష్కారంలో ఎలాంటి జాప్యం చేయకూడదని స్పష్టం చేశారు.శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో వివిధ శాఖల ప్రజా సమాచార అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో కలెక్టర్ ఈ ఆదేశాలు జారీ చేశారు.ఈ నెల 28న సమాచార హక్కు కమిషన్ సభ్యులు జిల్లాకు రానున్న నేపథ్యంలో, కమిషన్‌కు అప్పీలు చేసుకున్న దరఖాస్తులకు సంబంధించిన సమాచారాన్ని తక్షణమే అందించాలని సూచించారు. ఇందుకు సంబంధించిన నివేదికలను సోమవారంలోగా కలెక్టరేట్‌లో సమర్పించాలని ఆదేశించారు.ముఖ్యంగా పోలీస్, రెవెన్యూ, విద్యాశాఖల పరిధిలో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ప్రజలకు సమాచారం అందించడంలో అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, సమాచార హక్కు చట్ట నిబంధనలను పాటిస్తూ పారదర్శకంగా విధులు నిర్వహించాలని సూచించారు.

ఇంద్రవెల్లిలో కొమురం భీం కాంస్య విగ్రహం ఆవిష్కరణ

- **ఆదివాసులంతా ఐక్యంగా ఉంటూ గ్రామాలను అభివృద్ధి చేసుకోవాలి: మాజీ ఎంపీ సోయం బాపూరావు**

ఇంద్రవెల్లి, అక్టోబర్ 23 (ప్రజానేస్తం జ్వాల):




ఆదివాసులంతా ఐక్యంగా ఉంటూ తమ తమ గ్రామాలను అభివృద్ధి చేసుకోవాలని మాజీ ఎంపీ, మాజీ ఎమ్మెల్యే, రాజ్ గోండ్ సేవా సమితి రాష్ట్ర అధ్యక్షుడు సోయం బాపూరావు పిలుపునిచ్చారు. ఆదివాసీల ఐక్యతతోనే అభివృద్ధి సాధ్యమని పేర్కొన్నారు.ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లి మండల కేంద్రంలో కొమురం భీం కాంస్య విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమం అట్టహాసంగా నిర్వహించారు. తొలుత రగల్ జెండా ఆధ్వర్యంలో ఇంద్రవెల్లి అమరస్తూపం వద్ద నివాళులర్పించారు. అనంతరం ఆదివాసీ సంప్రదాయ డోలు వాయిద్యాల నడుమ భారీ ర్యాలీ నిర్వహించారు. ఆదివాసీల నినాదాలతో ఇంద్రవెల్లి సందడిగా మారింది.అనంతరం కొమురం భీం కాంస్య విగ్రహాన్ని ఆవిష్కరించారు. స్థానిక వ్యవసాయ మార్కెట్‌లో నిర్వహించిన భారీ బహిరంగ సభలో పలువురు నాయకులు ప్రసంగించారు.ఈ సందర్భంగా సోయం బాపూరావు మాట్లాడుతూ.. ఆదివాసులంతా విభేదాలను పక్కనపెట్టి ఐక్యంగా ముందుకు సాగాలని, తమ గ్రామాల అభివృద్ధికి సమష్టిగా కృషి చేయాలని కోరారు. ఆదివాసీ సంస్కృతి, సంప్రదాయాలు, అస్తిత్వాన్ని కాపాడుకుంటూ అభివృద్ధి పథంలో పయనించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్, ఎంపీ గేడం నగేష్, తుడుం దెబ్బ రాష్ట్ర అధ్యక్షుడు మైపతి అరుణ్, కెలాపూర్ ఎమ్మెల్యే రాజు, మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు, మాజీ డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి, రాజ్ గోండ్ ఇంద్రవెల్లి మండల అధ్యక్షుడు కనక తులసిరామ్, సార్ మెడీలు, పటేళ్లు, దేవరీలు, ఆదివాసీలు తదితరులు పాల్గొన్నారు.

సూర్యాపేట జిల్లాలో విషాదం.. కోతుల దాడిలో 12 ఏళ్ల బాలుడు మృతి!

నడిగూడెం మండలం వల్లాపురంలో ఘటన

అమ్మమ్మ ఇంటికి వెళ్తుండగా కోతుల గుంపు దాడి చేసినట్లు స్థానికుల వెల్లడి

సూర్యాపేట, అక్టోబర్ 23 (ప్రజానేస్తం జ్వాల న్యూస్):



సూర్యాపేట జిల్లాలో విషాదకర ఘటన చోటుచేసుకుంది. కోతుల గుంపు దాడిలో 12 ఏళ్ల బాలుడు ప్రాణాలు కోల్పోయాడు. నడిగూడెం మండలం వల్లాపురం గ్రామంలో జరిగిన ఈ ఘటన స్థానికంగా తీవ్ర విషాదాన్ని నింపింది.స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. వల్లాపురం గ్రామానికి చెందిన మొక్క వీరబాబు కుమారుడు నిశాంక్ గౌడ్ (12) గురువారం/శుక్రవారం సాయంత్రం అమ్మమ్మ ఇంటికి వెళ్తుండగా కోతుల గుంపు దాడి చేసినట్లు సమాచారం. ఈ ఘటనలో బాలుడు తీవ్రంగా గాయపడి మృతి చెందినట్లు స్థానికులు వెల్లడించారు.బాలుడి మృతితో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరవుతున్నారు. గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కోదాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు సమాచారం.కోతుల బెడదపై ఆందోళనకోతుల గుంపుల సంచారం, దాడుల ఘటనలతో గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ముఖ్యంగా చిన్నారులు, వృద్ధుల భద్రతపై ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. సంబంధిత అధికారులు స్పందించి కోతుల బెడద నివారణకు చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

ఈ పండ్లను పొరపాటున కూడా ఫ్రిడ్జ్‌లో పెట్టకండి..

రోజువారీ ఆహారంలో పండ్లకు ప్రత్యేక స్థానం ఉంటుంది. ఇవి శరీరానికి శక్తిని అందించడమే కాక.. ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుంటే రోజూ తీసుకోవాల్సినవే. అయితే కొందరు ఎక్కువ రోజులు నిల్వ ఉంచేందుకు ఫ్రిడ్జ్ సహాయాన్ని తీసుకుంటారు. కానీ కొన్ని రకాల పండ్లను ఫ్రిడ్జ్ లో నిల్వ ఉంచడం వల్ల పోషకాలు తగ్గిపోతాయి. అంతేకాదు వాటి సహజమైన రుచి, నాణ్యత కూడా తగ్గిపోతుంది. వేసవిలో ఎక్కువగా కనిపించే పుచ్చకాయను చాలా మంది ఫ్రిడ్జ్ లో నిల్వ చేస్తారు. కానీ దీని తేమ, పోషక విలువలు గది ఉష్ణోగ్రతలోనే బాగుంటాయి. ఫ్రిడ్జ్ లో ఉంచినప్పుడు ఇందులో ఉండే లైకోపిన్, బీటా కెరోటిన్ వంటి యాంటీఆక్సిడెంట్లు పని చేయలేకపోతాయి. అందువల్ల పుచ్చకాయను ఫ్రిడ్జ్ లో కాకుండా గది ఉష్ణోగ్రతలో నిల్వ చేయాలి.మార్కెట్‌లో లభించే మామిడిపండ్లలో చాలా భాగం ఇథలీన్ వాయువుతో మగ్గించబడుతుంటాయి. అలాంటి పండ్లు ఫ్రిడ్జ్ లో ఉంచితే అవి త్వరగా నల్లబడిపోతాయి. మామిడి ఇంకా మగ్గని దశలో ఉంటే గది ఉష్ణోగ్రతే మంచి పరిష్కారం. పండిన తరువాత కొంతసేపు నిల్వ ఉంచాలంటే ఫ్రిడ్జ్ లో పెట్టవచ్చు కానీ ఎక్కువసేపు ఉంచకపోవడం ఉత్తమం.అరటిపండ్లను చల్ల ప్రదేశాల్లో ఉంచినప్పుడు అవి త్వరగా రంగు మారి నలుపు అవుతాయి. ఫలితంగా అందవిహీనంగా మారిపోతాయి. పైగా రుచి కూడా తగ్గిపోతుంది. కనుక అరటిపండ్లను గదిలో ఉంచితేనే అవి సన్నగా ఉండి రుచికరంగా ఉంటాయి. పండని అవకాడోను ఫ్రిడ్జ్‌లో పెట్టినప్పుడు అది సమయానికి మగ్గకపోవచ్చు. కాస్త మగ్గిన తర్వాత ఫ్రిడ్జ్‌లో ఉంచితే కొంతకాలం నిల్వ ఉంటుంది. కానీ రుచి మెత్తబడకుండా ఉండాలంటే గది ఉష్ణోగ్రతే మేలు చేస్తుంది.చల్లదనంలో ఉంచిన ద్రాక్ష పండ్లు తేమ కోల్పోయి త్వరగా వాడిపోతాయి. ఫలితంగా రుచి తగ్గిపోతుంది. గది ఉష్ణోగ్రతలో ఉంచితే ఇవి తాజాగా ఉంటాయి. అయితే ఎక్కువ రోజులు నిల్వ ఉంచే అవసరం ఉంటే ఎయిర్‌టైట్ డబ్బాలో వేసి ఫ్రిడ్జ్ లో పెట్టడం మంచిది.

భూ అక్రమాలపై ముగ్గురు రెవెన్యూ అధికారుల సస్పెన్షన్

- **హుజూర్‌నగర్‌లో భూ లావాదేవీల్లో అవకతవకలు.. కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్ కఠిన చర్యలు**
- **తప్పుడు ధ్రువీకరణ నివేదికలు సమర్పించినట్లు ప్రాథమిక విచారణలో గుర్తింపు**

సూర్యాపేట, అక్టోబర్ 23 (ప్రజానేస్తం జ్వాల న్యూస్):



హుజూర్‌నగర్‌లో భూ లావాదేవీలకు సంబంధించి అవకతవకలు జరిగినట్లు వచ్చిన ఆరోపణల నేపథ్యంలో ముగ్గురు రెవెన్యూ అధికారులను జిల్లా కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్ సస్పెండ్ చేశారు. హుజూర్‌నగర్ తహసీల్దార్ బి. కవిత, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ కాశీం షరీఫ్, గ్రామ పాలన అధికారి (జీపీవో) ఎస్.కె. జానీ పాషాలను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.సర్వే నంబర్లు 458, 281లో అవకతవకలుహుజూర్‌నగర్ గ్రామం, మండల పరిధిలోని సర్వే నంబర్లు 458, 281లో భూముల లావాదేవీలపై నిర్వహించిన ప్రాథమిక విచారణలో పలు అవకతవకలు వెలుగులోకి వచ్చినట్లు అధికారిక ప్రకటనలో పేర్కొన్నారు. హుజూర్‌నగర్ ఆర్డీవో సమర్పించిన నివేదికల ఆధారంగా జిల్లా యంత్రాంగం ఈ వ్యవహారంపై చర్యలు చేపట్టింది.నాగార్జునసాగర్ ప్రాజెక్టు (ఎన్ఎస్పీ) సాగునీటి కాలువలకు సంబంధించిన భూములు, భూసంస్కరణల చట్టం పరిధిలోని భూముల విషయంలో పాత రెవెన్యూ రికార్డులు, గత విచారణలు, న్యాయస్థానాల ఉత్తర్వులను పూర్తిస్థాయిలో పరిశీలించకుండానే లావాదేవీలు జరిగినట్లు ప్రాథమిక విచారణలో గుర్తించినట్లు అధికారులు వెల్లడించారు.తప్పుడు నివేదికల సమర్పణపై ఆరోపణలుభూముల వాస్తవ స్థితి, భూ పరిమితి చట్టానికి సంబంధించిన వివరాలు, ఎన్ఎస్పీ కాలువ భూముల రికార్డులను సక్రమంగా పరిశీలించకుండా తప్పుడు ధ్రువీకరణ నివేదికలు సమర్పించినట్లు విచారణలో గుర్తించినట్లు తెలిపారు. ప్రభుత్వ భూముల పరిరక్షణ, చట్ట నిబంధనల అమలులో సంబంధిత అధికారుల బాధ్యతల నిర్వహణపై కూడా అభ్యంతరాలు వ్యక్తమైనట్లు పేర్కొన్నారు.ఎన్ఎస్పీ కాలువ భూములు, భూ పరిమితి చట్టం పరిధిలోని భూములను అక్రమంగా బదలాయించేందుకు ప్రయత్నించారనే ఆరోపణలపైనా అధికారులు దృష్టి సారించారు. రిజిస్ట్రేషన్ సమయంలో తప్పుడు డిక్లరేషన్లు సమర్పించినట్లు వచ్చిన ఆరోపణలపై సంబంధిత వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని పోలీసులకు క్రిమినల్ ఫిర్యాదు చేసినట్లు వెల్లడించారు.ప్రభుత్వ భూముల పరిరక్షణకు ప్రాధాన్యం ప్రభుత్వ భూములు, ముఖ్యంగా సాగునీటి ప్రాజెక్టులకు సంబంధించిన భూములను పరిరక్షించడం రెవెన్యూ అధికారుల ప్రధాన బాధ్యత అని కలెక్టర్ స్పష్టం చేశారు. భూ పరిమితి చట్ట నిబంధనలను పకడ్బందీగా అమలు చేయాలని, విధుల నిర్వహణలో నిర్లక్ష్యం లేదా అవకతవకలకు పాల్పడితే బాధ్యులపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

పోలీసు అమరవీరుల త్యాగాలు అజరామరం

- **పాటలు, కళారూపాలతో ప్రజల్లో అవగాహన కల్పించిన సూర్యాపేట జిల్లా పోలీసు కళా బృందం**
- **ఈ నెల 26న ఎస్పీ కార్యాలయంలో రక్తదాన శిబిరం.. ప్రజలు, యువత పాల్గొనాలని పిలుపు**

సూర్యాపేట, అక్టోబర్ 23 (ప్రజానేస్తం జ్వాల న్యూస్):





శాంతిభద్రతల పరిరక్షణలో ప్రాణాలను సైతం లెక్కచేయకుండా విధులు నిర్వహించి అమరులైన పోలీసుల త్యాగాలు చిరస్మరణీయమని సూర్యాపేట జిల్లా పోలీసు కళా బృందం పేర్కొంది. పోలీస్ ఫ్లాగ్ డే, పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా తిరుమలగిరి, నాగారం, అర్వపల్లి మండల కేంద్రాల్లో ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు.ఆయా మండల కేంద్రాల్లోని ప్రధాన కూడళ్ల వద్ద పోలీసు కళా బృందం సభ్యులు పాటలు, కళారూపాలు, సాంస్కృతిక ప్రదర్శనల ద్వారా ప్రజలకు అవగాహన కల్పించారు. సమాజంలో శాంతియుత వాతావరణం నెలకొల్పేందుకు పోలీసులు రాత్రింబవళ్లు ఎదుర్కొంటున్న సవాళ్లు, విధి నిర్వహణలో వారు చేస్తున్న త్యాగాలను కళారూపాల ద్వారా కళ్లకు కట్టినట్లు ప్రదర్శించారు.ప్రజలు ప్రశాంతంగా జీవించేందుకు పోలీసులు అసాధారణ పరిస్థితుల్లోనూ విధులు నిర్వహిస్తున్నారని, ఈ క్రమంలో ప్రాణత్యాగం చేసిన అమరవీరుల సేవలు ఎప్పటికీ మరువలేనివని కళా బృందం సభ్యులు వివరించారు. ఈ కార్యక్రమాల్లో పాల్గొన్న స్థానిక పోలీసు సిబ్బంది మాట్లాడుతూ పోలీసుల త్యాగాలను ప్రతి ఒక్కరూ గుర్తించాలని, పోలీసులకు ప్రజలకు మధ్య సత్సంబంధాలు మరింత బలోపేతం కావాలని ఆకాంక్షించారు. నేరరహిత సమాజ నిర్మాణానికి ప్రజలందరూ పోలీసులతో కలిసి సహకరించాలని పిలుపునిచ్చారు. 26న రక్తదాన శిబిరం పోలీసు అమరవీరుల సంస్మరణ కార్యక్రమాల్లో భాగంగా ఈ నెల 26న సూర్యాపేట జిల్లా ఎస్పీ కార్యాలయంలో రక్తదాన శిబిరం నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రజలు, యువత, స్వచ్ఛందంగా ముందుకు వచ్చే రక్తదాతలు అధిక సంఖ్యలో పాల్గొని రక్తదానం చేయాలని కోరారు.తలసేమియా బాధితులు, రోడ్డు ప్రమాదాల్లో గాయపడి రక్తం అవసరమైన వారు, ఇతర అత్యవసర వైద్య పరిస్థితుల్లో ఉన్నవారికి రక్తం అందించడంలో రక్తదానం కీలకమని పేర్కొన్నారు.వ్యాసరచన, ర్యాలీలతో అవగాహన పోలీసు స్టేషన్ల పరిధిలో సైకిల్ ర్యాలీలు, కొవ్వొత్తుల ర్యాలీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమాల్లో ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని పోలీసు అమరవీరులకు నివాళులర్పించాలని సూచించారు. విద్యార్థుల కోసం ప్రత్యేక వ్యాసరచన పోటీలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. సైబర్ మోసాల నివారణ, మాదకద్రవ్యాల నిర్మూలన, రోడ్డు ప్రమాదాల నివారణలో ప్రజల భాగస్వామ్యం వంటి సామాజిక అంశాలపై పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. విద్యార్థులు ఈ పోటీల్లో ఉత్సాహంగా పాల్గొని సామాజిక చైతన్యానికి తోడ్పడాలని పిలుపునిచ్చారు.

మీ ఆరోగ్యం మీ చేతుల్లోనే



శరీరంలో యూరిక్ యాసిడ్ స్థాయి పెరిగినప్పుడు అనేక ఆరోగ్య సమస్యలు తలెత్తే ప్రమాదం ఉంటుంది. ఈ సమస్యలు ముఖ్యంగా ఆర్థరైటిస్, కిడ్నీ సంబంధిత వ్యాధుల రూపంలో కనిపిస్తాయి. అధిక యూరిక్ యాసిడ్ కారణంగా జాయింట్లలో నొప్పులు, వాపులు మొదలవుతాయి. గ్రీన్ కలర్ ఫుడ్స్ దినచర్యలో భాగం చేస్తే ఈ సమస్యను సహజంగా నివారించవచ్చు. పాలకూరలో శక్తివంతమైన యాంటీఆక్సిడెంట్లు ఎక్కువగా ఉంటాయి. ఇందులో ఉన్న మెగ్నీషియం శరీరంలో యూరిక్ యాసిడ్ స్థాయిని సమతుల్యంగా ఉంచడంలో ముఖ్యపాత్ర పోషిస్తుంది. పాలకూరను రోజూ తీసుకోవడం వల్ల శరీరానికి పుష్కలమైన పోషకాలు అందించడమే కాక.. ఆరోగ్యాన్ని కాపాడేందుకు సహాయపడుతుంది.పచ్చి బఠానీలలో ఫైబర్ అధికంగా ఉంటుంది.. ఇది శరీరానికి కావలసిన శక్తిని అందిస్తుంది. వీటిలో ఉన్న యాంటీఆక్సిడెంట్లు శరీరాన్ని డిటాక్స్ చేయడంలో తోడ్పడతాయి. గౌట్ వంటి సమస్యలను తగ్గించడానికి ఈ బీన్స్ చాలా ఉపయోగపడతాయి.గ్రీన్ టీ శరీరంలోని హానికరమైన వ్యర్థాలను బయటకు పంపడంలో సహాయపడుతుంది. ఈ టీలో ఉండే యాంటీఆక్సిడెంట్లు, ఆహ్లాదకరమైన రుచి యూరిక్ యాసిడ్ స్థాయిలను తగ్గించడంలో తోడ్పడతాయి. ప్రతిరోజూ ఒక కప్పు గ్రీన్ టీ తాగడం వల్ల మంచి ఫలితాలు పొందవచ్చు. సెలరీలో ఉన్న పోషకాలు మూత్రపిండాల పనితీరును మెరుగుపరుస్తాయి. ఇది శరీరంలోని వాపును తగ్గించడంలో కూడా సహాయపడుతుంది. యూరిక్ యాసిడ్ స్థాయిని సమతుల్యంగా ఉంచడంలో ఈ ఆకుకూర సహాయపడుతుంది. అవకాడోలో ఆరోగ్యకరమైన కొవ్వులు అధికంగా ఉంటాయి. ఈ పండు శరీరానికి అవసరమైన ఎనర్జీ అందించే ప్రక్రియను మెరుగుపరుస్తుంది. ఇది శరీరంలోని వ్యర్థ పదార్థాలను వెలుపలికి పంపడంలో సహాయపడుతుంది. యూరిక్ యాసిడ్ స్థాయిని తగ్గించడానికి అవకాడో ఉపయోగపడుతుంది. ఆస్పరాగస్‌లో ఫైబర్, ప్యూరిన్లు సమతుల్యంగా ఉంటాయి. ఇది శరీరంలోని హానికరమైన పదార్థాలను తగ్గించడంలో సహాయపడుతుంది. కాబట్టి ఆస్పరాగస్ ను తగిన మోతాదులో తీసుకోవడం మంచిది.గ్రీన్ బీన్స్ లో ప్యూరిన్లు తక్కువగా ఉంటాయి.. అందుకే ఇవి యూరిక్ యాసిడ్ స్థాయిని నియంత్రించడంలో సహాయపడతాయి.